మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట



# నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తా : మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి

**మక్తల్, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానని, ఈ ప్రాంతంలోని బీడు భూములన్నింటికీ సాగునీరు అందించి సస్యశ్యామలం చేసేందుకు కృషి చేస్తానని మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మక్తల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన హామీ మేరకు నవంబర్ 30న మహబూబ్‌నగర్ లో జరిగిన రైతు పండుగ సంబరాల్లో భాగంగా రైతాంగానికి పూర్తిస్థాయిలో రుణమాఫీని చేయడం జరిగిందన్నారు. అలాగే ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తి కోసం దాదాపు రూ.20 వేల కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. రైతులు పండించిన వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించి ప్రతి రైతుకు ఎకరా వెంబడి దాదాపు రూ.12 వేలు అదనపు ప్రయోజనం సమకూర్చడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎవరు సలహాలు, సూచనలు ఇచ్చినా కూడా స్వీకరిస్తామని, కాకపోతే అర్ధరహితమైన విమర్శలు చేసి అభివృద్ధిని అడ్డుకుంటే ఏమాత్రం సహించేది లేదన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పిటిసి జి.లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గణేష్ కుమార్, పట్టణ అధ్యక్షులు ఏ.రవికుమార్, మాజీ ఉపసర్పంచ్ కట్ట సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి

# శ్రీ కురుమూర్తి కొండకు పోటెత్తిన భక్తజనం

**జాతర రహదారులన్నీ స్వామివారి దర్శనానికే**

**యాత్రికులకు కొనుగోళ్ళతో సందడి.. క్యూలైన్లో అవస్థలు పడ్డ భక్తులు**



కురుమూర్తి జాతరలో భక్తులు

**చిన్నచింతకుంట, డిసెంబరు 1 ప్రభాతవార్త:** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి జాతరకు భక్తులు పోటెత్తారు.ఆదివారం అమావాస్య కావడం అదేవిధంగా పట్టణ ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు సెలవు కావడంతో శ్రీ కురుమూర్తి స్వామి కొండ భక్తులతో పోటెత్తింది.కొండ దిగువ నుంచి స్వామివారి సన్నిధి వరకు క్యూలైన్లలో గంటల తరబడి బారులు తీరి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు అవస్థలు పడ్డారు.కొండ దిగువన వేలాదిగా తరలివచ్చిన భక్తులతో జాతర మైదానం కిక్కిరిసిపోయింది.భక్తులను అదుపు చేసేందుకు దేవస్థాన సిబ్బంది , పోలీసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.రాజగోపురం ముందు భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని స్మరించుకున్నారు.స్వామివారి దర్శనానికి తరలివచ్చే భక్తులకు దర్శనంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు. కొండపై తిరుమల తిరుపతి దేవస్థానంలో మాదిరిగా భక్తులు వేచి ఉండే షెడ్లను ఏర్పాటు చేస్తే సమయపాలన అనుగుణంగా దర్శనానికి పంపిస్తే భక్తులకు ఇబ్బందులు రావని పలువురు భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.దాసంగాల పేరిట కొత్త మట్టికుండలో పచ్చిపులుసు పరమాన్నంతో స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు.భక్తులు స్వామివారి పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు.కొండ దిగువన కళ్యాణ మండపం,కోనేరు పరిసర ప్రాంతాలు చెత్త చెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తుందని, ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటిస్తే పారిశుద్ధ్య లోపం కనిపించదని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. యాత్రికలు కొనుగోళ్లతో సందడి పట్టణ, పల్లె ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం కొండ దిగువన జాతర మైదానం లోని మిఠాయి, ఫ్యాన్సీ, ఇత్తడి, రాగి వస్తువులు, మట్టి గాజులు, పిల్లల ఆట వస్తువులు దుకాణాలు యాత్రికుల కొనుగోళ్లతో సందడిగా మారాయి.సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పల్లెవాసులు తమ ఇంటి ఆడపడుచులకు మట్టి గాజులు వేయించడం ఆనవాయితీ, జాతరకు వస్తే తప్పనిసరిగా మిఠాయిలను కొనుగోలు చేస్తారు పల్లెవాసులు, రంగులరాట్నాల వద్ద యువతి, యువకులు, చిన్నారుల కోలాహలం కనిపించింది.జాతరలో వస్తువుల కొనుగోలు అనంతరం జాతర మైదానానికి అనుకొని ఏర్పాటుచేసిన మాంసం దుకాణాలలో మాంసప్రియులతో కిక్కిరిసిపోయింది.పల్లె ,పట్టణ ప్రాంతాల నుంచి తరలివచ్చిన యాత్రికులు కాల్చిన మాంసాన్ని రుచి చూడడం తప్పనిసరి,తమ కుటుంబ సభ్యులతో కలిసి కాల్చిన మాంసాన్ని రుచి చూసిన తర్వాతే తమ గ్రామాల వైపు బయలుదేరుతారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

# పాలమూరుకు ఊపిరి

- లక్ష కోట్లతో ఉమ్మడి మహబూబ్‌నగర్‌కు మహర్దశ
- సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనతో సర్వత్రా హర్షం
- ఉమ్మడి జిల్లాలో ఇక అభివృద్ధి పరుగులు
- ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన హామీ
- 20లక్షల ఎకరాలకు నీళ్లందితే ఇక సస్యశ్యామలమే..
- కొడంగల్ పారిశ్రామిక వాడతో ఉద్యోగావకాశాలు
- అన్ని జిల్లాల్లో.. పల్లెల్లో ఇదే చర్చ..

ఎవడో వచ్చి పాలమూరును దత్తత తీసుకోవడంకాదు.. మీ పాలమూరు బిడ్డనే ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్నాడు.. ఎవరి దయా దాక్షిణ్యాలు మాకు అవసరం లేదన్నారు. మనకు వచ్చిన ఈ అవకాశాన్ని జారవిడుచుకుందామా?పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టును మనం పూర్తి చేసుకోవద్దా? ఒకే సంతకంతో మన జిల్లాకు కావాల్సిన అన్నీ తెచ్చుకుందాం.. ఏడాదికొక రూ.20వేల కోట్లు మా జిల్లాకు ఇవ్వాలని మీ తరపున మా మంత్రి వర్గాన్ని నేను అడుగుతా..ఐదేళ్లలో లక్ష కోట్లు ఈ జిల్లాకు తెచ్చకుంటే బంజరు భూములు బంగారు భూములుగా మారవా? కేసీఆర్ కమీషన్ల కక్కుర్తి కోసం కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు తీసుకెళ్లిండు...అలాంటిది మన గడ్డ అభివృద్ధికి లక్ష కోట్లు తెచుకోలేమా.. "

- అమిస్తాపూర్ రైతు పండుగలో సీఎం రేవంత్ రెడ్డి



అమిస్తాపూర్ రైతు పండుగ సభలో పాల్గొన్న రైతులకు, ప్రజలకు వందనం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** సొంత గడ్డపై పాలమూరు బిడ్డ రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో లక్ష మంది రైతుల సమక్షంలో ఇచ్చిన హామీ..చెప్పిన మాట..రైతులకు కల్పించిన భరోసా..ఇప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లాలో సర్వత్రా ఇదే చర్చ కొనసాగుతున్నది. 20లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని చెప్పినా.. రాష్ట్ర కేబినెట్‌ను ఒప్పించి మెప్పించి ఉమ్మడి జిల్లాకు ఏడాదికి 20వేల కోట్లు కేటాయిస్తామని ధీమా వ్యక్తం చేసినా అది ఆయనకే చెల్లింది. గతంలో పదేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ ఉత్తర తెలంగాణలోని ప్రాజెక్టులు పూర్తి చేశారు..పరిశ్రమలు అక్కడికే తీసుకెళ్లారు..వాళ్లకు ఫాం హౌసులు ఉన్నాయి.. మనకు వద్దా" అంటూ శనివారం అమిస్తాపూర్ రైతు పండుగ సభ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి మాటలను యాది చేసుకుంటున్నారు. మన ఉమ్మడి పాలమూరు బిడ్డ సీఎం అయిండు కాబట్టి మన ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందని, ప్రాజెక్టులు పూర్తి అయి మన ప్రాంతం అంతా సస్యశ్యామలం అవుతుందని చర్చించుకుంటు న్నారు. కొడంగల్ పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసి 25వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అన్ని మాట ప్రకారం నిధులు విడుదల చేసి పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేసి ఉమ్మడి జిల్లాలో పచ్చదనం పరుచుకున ేలా చేస్తే చిరకాలం గుండెల్లో పెట్టుకొని చూసుకుంటామంటే సోషల్ మీడియా వేదికగా చెప్పుకుంటున్నారు. గతంలోనూ ఉమ్మడి జిల్లాపై నిర్వహించిన సమీక్షలో అన్ని గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మించాలని ఈమేరకు నివేదికలు రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు.

**పాలమూరు - రంగారెడ్డి పూర్తయితే..**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే కాకుండా రంగారెడ్డి, నల్గొండ జిల్లాలకు సాగునీరుతోపాటు 12.30లక్షల ఎకరాలకు తాగునీరు అందించేందుకు రూ.35200కోట్లతో పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 2015లో శ్రీకారం చుట్టడం జరిగింది. అంజనగిరి, వీరాంజనేయ, వెంకటాద్రి, కురుమూర్తి రాయ, ఉదండాపూర్,లక్ష్మీదేవిపల్లి ఆరు ఎత్తిపోతల పథకాలు రూపుదిద్దుకుంటున్నాయి. వర్షాకాలంలో 60రోజులపాటు రోజుకు సుమారు 1.5టీఎంసీ చొప్పున 90టీఎంసీల వరద నీటిని ఎత్తిపోసేందుకు రూపొందించారు. ప్రాజెక్టులోని మొదటి లిఫ్ట్ ను నార్లాపూర్ పంప్ హౌజ్ వద్ద 2023 సెప్టెంబర్ 3న చేపట్టిన డ్రైరన్ విజయవంతం కాగా అప్పటి సీఎం కేసీఆర్ సెప్టెంబరు 16న నార్లాపూర్ వద్ద ఎత్తిపోతల పథకంలోని మొదటి పంప్‌ను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. వట్టెం, కర్వెన, ఉదండాపూర్ ప్రాజెక్టు పనులుకూడా సుమారు 70శాతం పైగా పూర్తి కావడంతో పాలమూరు ప్రాజెక్టుపై రైతుల కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో సీఎం ప్రకటనతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తి అయితే 10లక్షల ఎకరాల వరకు సాగునీరందుతుంది. ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఉమ్మడి జిల్లాలో 20లక్షల ఎకరాలకు నీళ్లందించి రైతులు రుణం తీర్చుకుంటానని రేవంత్‌రెడ్డి పేర్కొనడంతో అన్నదాతల్లో ఆశలు రేకెత్తాయి.

**చక చకా కొడంగల్ పనులు..**

ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ముఖ్యంగా కొడంగల్, నారాయణపేట మక్తల్ ప్రాంతాల్లో సాగు,తాగునీటి అవసరాలు తీర్చేందుకు నిర్మించ తలపెట్టిన కొడంగల్-నారాయణపేట-మక్తల్ ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. మొదటలో 10చెరువులకు నీటిని మళ్లించేందుకు 0.9టీఎంసీ సామర్థ్యం నుంచి 2.1టీఎంసీలకు పెంచాలని నిర్ణయించింది. అయితే తాజాగా 4.022టీఎంసీలను నిల్వచేసేందుకు జలాశయాలు చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నది. అందులో భాగంగా రూ.4350కోట్లతో కొడంగల్-నారాయణపేట- మక్తల్ ఎత్తిపోతల పథకానికి ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టగా టెండర్లు కూడా పూర్తయ్యాయి.రెండుప్యాకేజీల ద్వారా టెండర్లను పిలిచిన సంగతి తెలిసిందే. కొడంగల్-నారాయణపేట- మక్తల్ నియోజకవర్గాల్లో లక్ష ఎకరాకుల సాగునీరుతోపాటు నారాయణపేజ జిల్లాకు తాగునీరు అందించేందుకు ప్రాజెక్టును నిర్మించనున్నారు.

# నిరంజన్‌రెడ్డికి మతి భ్రమించింది

**వ్యవసాయ శాఖ మంత్రిగా ఆయన చేసింది శూన్యం**

**పాలమూరు ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదు..?**

**రైతు సంక్షేమమే మా ధ్యేయం**

**మహబూబ్ నగర్ జిల్లా**

**కాంగ్రెస్ అధ్యక్షుడు ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, డిసెంబరు 1 ప్రభాతవార్త :** పాలమూరు ముద్దుబిడ్డ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, రాష్ట్ర మంత్రి వర్యులు, ఎమ్మెల్యేలు. రైతు పండుగ సభకు రావడం హర్షించదగ్గ విషయమని మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు తాము లక్ష మంది వస్తారనుకుంటే దానికి రెట్టింపు స్థాయిలో రైతాంగం సభకు హాజరవడం తమ పట్ల రైతాంగానికి ఉన్న విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. ప్రతిపక్షాలు తమపై ఎన్ని కుట్రపూరిత ప్రచారాలు చేసినా ప్రజానీకం ఆ ప్రచారాన్ని నమ్మలేదని ఆ విషయం తేటతెల్లం అయిందని పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రులు ఎవ్వరూ కూడా పాలమూరు జిల్లాను పట్టించుకున్న పాపాన పోలేదని, రేవంత్ రెడ్డి సంవత్సరానికి రూ. 20వేల కోట్లు 5 ఏళ్ల పాటు కేటాయిస్తామని ప్రకటించడం జిల్లా ప్రజలందరూ గర్వించాల్సిన అంశమని పేర్కొన్నారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సభను ఉద్దేశించి రైతులను బెదిరించే సభగా అభివర్ణించడం సిగ్గుచేటు, నిన్నటి సభతో నిరంజన్‌రెడ్డికి మతిభ్రమించిందన్నారు. ఈ జిల్లాలో పుట్టి ఈ జిల్లాకే వెన్నుపోటు పొడిచేలా నిరంజన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని, జిల్లా అభివృద్ధికి పాటు పడుతున్న ముఖ్యమంత్రిపై మరోసారి నిరంజన్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరు, గుడ్డలూడదీసి కొడతారు ఖబర్దార్ నిరంజన్ రెడ్డి అంటూ ఘాటుగా స్పందించారు. సీఎం తన జిల్లాకు లక్ష కోట్లు కేటాయిస్తామన్న ప్రకటనను స్వాగతించాల్సింది పోయి విమర్శించడం సహేతుకం కాదన్నారు. పాలమూరు కంటే ఒక సంవత్సరం తర్వాత ప్రారంభమైన కాళేశ్వరం పూర్తయింది కానీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు అలసత్వం, నిర్లక్ష్యంపై బిఆర్ఎస్ పార్టీ జిల్లా ప్రజానీకానికి వివరణ ఇవ్వాలని డిమాండు చేశారు. జిల్లాలో ఉన్న 14 అసెంబ్లీ సీట్లలో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఈ ప్రాంత ప్రజలు గెలిపించిన విషయాన్ని, బిఆర్ఎస్ పార్టీని మట్టి కరిపించిన సంగతి బిఆర్ఎస్ నాయకులు గుర్తుంచుకోవాలని చెప్పారు. వ్యవసాయ మంత్రిగా ఉండి నిరంజన్ రెడ్డి జిల్లాకు చేసింది ఏమి లేదని ముఖ్యమంత్రిని విమర్శించే స్థాయి, అర్హత నిరంజన్ రెడ్డికి లేదని ఫైర్ అయ్యారు. కోయిల్ సాగర్, నెట్టెంపాడు, భీమా లాంటి పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తూనే నారాయణపేట్ కొడంగల్ ఎత్తిపోతల పథకానికి నాంది పలికామని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన ప్రతిపక్ష నాయకులు ముఖ్యమంత్రి ప్రకటనను రాజకీయాలకు అతీతంగా స్వాగతించాలని సూచించారు. కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మహబూబ్‌నగర్ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి

# హాస్టల్ విద్యార్థుల భోజనాల్లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భారీ కుట్రా

**ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేందుకే ఫుడ్ పాయిజన్‌కు ఒడిగట్టిన బిఆర్ఎస్**

**ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**వనపర్తి ప్రతినిధి డిసెంబరు 01 ప్రభాతవార్త :** రాష్ట్రంలో రోజు రోజుకు పెరుగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్ఠతను దెబ్బతీసేందుకు సంక్షేమ గురుకుల హాస్టల్స్ లో ఫుడ్ పాయిజన్ చేస్తూ బీఆర్ఎస్‌పార్టీ,ఆపార్టీ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భారీ కుట్రకు తెరతీశారని ఎమ్మెల్యే మేఘా రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సంక్షేమ హాస్టళ్ల కార్యదర్శిగా పని చేసిన విషయం తెలిసిందేనని ,ఈ క్రమంలో ఆయన అప్పట్లో ఫుడ్ కాంట్రాక్టు, వర్కర్స్ ను నామినేట్ పద్ధతిలో నియమించడం తో ప్రస్తుతం వాళ్లలో కొందరు ఇంకా ఆయన కంట్రోల్ లోనే ఉన్నారని అన్నారు.ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదుర్కోలేని కుచ్చిత బుద్ధి గల బీఆర్ఎస్ నాయకులు వారి విష ప్రయోగాలను విద్యార్థులపై ప్రయోగించడం సిగ్గుచేటు అని , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యకు ప్రాముఖ్యత ఇస్తూ సంక్షేమ హాస్టల్స్‌లో డైట్, కాస్మొటిక్ చార్జీలను పెంచడంతో పేద విద్యార్థులలో విద్య పట్ల ప్రభుత్వ చర్యల పట్ల విశ్వసనీయత బాగా పెరగడాన్ని జీర్ణించుకోలేని కొందరు విద్యార్థుల ఉసురు పోసుకుంటున్నారని తెలిపారు .ప్రభుత్వ ప్రతిష్ఠతను దిగజార్చేందుకు విద్యార్థులలో ఆత్మస్టేర్యాన్ని దెబ్బతీసేందుకు బిఆర్ఎస్, ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ చేస్తున్న భారీ కుట్రనే ఈ ఫుడ్ పాయిజన్ అని వివరించారు.వన పర్తి నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు ,మాజీ ప్రజా ప్రతినిధులందరూ ఆయా మండలాలలోనీ కెజిబివి,ఎస్‌టి, ఎస్‌టి, ఎస్సి, బిసి, మైనారిటీ వసతిగృహాలతో పాటు గురుకుల విద్యాలయాలను సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారిలో మనో ధైర్యాన్ని నింపాలని ఎమ్మెల్యే సూచించారు.హాస్టల్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉండాలని, విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

# గద్వాలలో ఆ ముగ్గురు..

- పీడీఎస్ దందాలో దిట్టలు
- త్రిమూర్తులకే వడ్ల కేటాయింపులు
- ఎమ్మెల్యేల అండతో ప్రతి ఏడాదికి కోట్లు గడిస్తున్న వైనం
- గద్వాలలో మిల్లర్ల మాయాజాలం

**గద్వాల,డిసెంబరు1 ప్రభాతవార్త:**1994 సంవత్సరం నుండి 2024 సంవత్సరం దాకా పనికి ఆహారం పథకం, పిడిఎస్ బియ్యం, వడ్ల అక్రమ వ్యాపారాలను అస్త్రంగా చేసుకొని వందల కోట్ల వ్యాపా రాలు చేస్తూ ప్రతి ఎడాది ఎనిమిది కోట్లు సంపాదిస్తున్నారని, మా పొట్టలు కొడుతున్నారని పలువురు మిల్లర్లు ఆరోపిస్తున్నారు. 1994 నుండి 2024 ఇప్పటి వరకు ఉన్న ఎమ్మెల్యే లు, సంబంధిత శాఖ అధికారులను మచ్చిక చేసకోవడం, ఆ శాఖల మంత్రులతో ఫోటోలు దిగడం, ఫ్లెక్సీలు కట్టడం ఈ మిల్లర్ల మాయజాలం అని మిల్లర్లు అంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనికి ఆహారం పథకం బియ్యం, పిడిఎస్ బియ్యం, వడ్లు కొనుగోలు చేసి విజయవాడ, చెన్నై, గుజరాత్, పూణేలకు రాయచూర్ బ్రోకర్ ల ద్వారా దొడ్డి దారిలో అక్రమ వ్యాపారాలు చేయడంలో రాటు దెలారు. మొట్ట మెదట కొండపల్లి గ్రామానికి చెందిన డీలర్, ఆయన కుమారులతో, కర్నూల్ కు చెందిన ఒక రెడ్డి తో కలసి వ్యాపారం చేశారు. వారితో విభేదాలు రావడంతో విడిపోయారు. కర్నూల్ రెడ్డి, ముదిరాజ్ లతో వ్యాపారం విభేదాలతో విడిపోయారు. గత సీజన్లో కూడా మరొక రెడ్డితో విభేదాలు వచ్చినట్లు తెలుస్తుంది. 2023-24లో మాజీ జడ్పి చైర్మన్‌కు తెలియకుండా ఎమ్మెల్యేతో, ఎమ్మెల్యే కు తెలియకుండా జడ్పి చైర్మన్ ద్వారా వడ్ల వ్యాపారం చేసి ఏడాదికి రూ.8 కోట్ల వరకు సంపాదించినట్లు మిల్లర్లు ఆరోపస్తున్నారు. సీఎంఆర్ మీద రైస్ మిల్లులకు దాన్యం కేటాయించడానికి మిల్లుల సామర్థం పరిగణలోకి తీసుకుంటారు. అందుబాటులో ఉన్న మిల్లులకు చాన్యం కేటాయించేలా సమ న్యాయం పాటించాల్సి ఉంది కానీ జిల్లాలో సీఎంఆర్ కేటాయిం పుల్లో అవేనీ పాటిస్తున్న దాఖలాలు కనిపించడం లేదని మిల్లర్స్ ఆరోపస్తున్నారు. అధికార పార్టీకి చెందిన మికర్స్ కు ఒక న్యాయం, ఇతరులకు ఇంకో న్యాయం అన్నట్లుగా జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకు సేకరించి ధాన్యాన్ని జిల్లాలోని 62 మిల్లులకు వాటి సామర్థ్యాన్ని బట్టి కోటా యించాల్సి ఉండగా, అధికార పార్టీకి చెందిన పేరున్న ముగ్గరికి వేలాది బస్తాలు ఇస్తున్నారని మిల్లర్స్ ఆరోపస్తున్నారు.



మిల్లులో దింపుతున్న సిఎంఆర్ వడ్లు

**ఆ త్రిమూర్తులకే అధికారుల ప్రాధాన్యం...**

వడ్ల కేటాయింపులో అధికారులు ఆ త్రిమూర్తులకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మిల్లర్స్ అంటున్నారు. మిగిలిన వారికి వందల్లో కూడా కేటాయింపులు జరపడానికి అధికారులు మీనమేషాలు పడుతున్నట్లు అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏమీ జరుగుతోంది. వానాకాలం సీజన్లో దిగుబడి అంచనా వేసి 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని జిల్లా పౌర సరఫరాల సంస్థ నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల పరిధిలో పీఏసి ఎస్, ఐకేపీ సేకరణ కేంద్రాలను ప్రారంభించాయి. జిల్లాలో నాణ్యమైన సన్నరకాలను సాగు చేసే మండలాల్లో ఏర్పాటు వేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి అధికార పార్టీ మిల్లర్స్‌కు అధిక దాన్యం కేటాయిం పులు జరిగేలా అధికారులపై గర్వాల మండలానికి చెందిన అధికార పార్టీ నాయకుడు వత్తిడి తెస్తున్నారని మిల్లర్స్ ఆరోపిస్తున్నారు.తమ వారికి కేటాయించాకే మిగిలినమిల్లర్లకు ఇవ్వాలని అదికారులపై వత్తిడి తెస్తున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి.అధికారికంగా ధాన్యం కేటాయింపుల ప్రకారం జిల్లాలోని 60మిల్లులకు 500 సింటాళ్ల చొప్పున దాన్యం కేటాయింపులు జరగాల్సి ఉంది.కేవలం అధికారపార్టీకి అనుకూలంగా ఉన్న మిల్లర్లకు మాత్రమే కేటాయింపులు జరుగుతున్నాయని జిల్లామిల్లర్లసంఘం ఆరోపిస్తోంది. అధికారులు -మిగతా4లో..

# భక్తిశ్రద్ధలతో శనేశ్వరస్వామి సామూహిక వ్రతాలు

**519 జంటలచే సామూహిక శనేశ్వర వ్రతాలు**

**తెలంగాణ,ఆంధ్ర,కర్ణాటక రాష్ట్రాల భక్తుల సందడి**

**బిజినేపల్లి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** నంది వడ్డేమాన్ గ్రామంలో అత్యంత పురాతనమైన శ్రీసార్ధ సప్త జేష్ఠ మాత సమేత శనేశ్వర ఆలయంలో సామూహిక శనీశ్వర వ్రతాలు వేదమంత్రోచరణల మధ్య శాస్త్రోక్తంగా భక్తులచే భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ నవగ్రహాలలో శనీశ్వర స్వామికి ప్రత్యేక విశిష్టత ఉన్నదని, జన్మించిన ప్రతి మానవునిలో జన్మరిత్యా గోచార రీత్యా శనీశ్వర స్వామి గ్రహ సంచారం జరుగుతుందని, ఆయన ప్రిత్యర్థం శనీశ్వర స్వామి కృపాకటాక్షాలు పొందుటకు స్వామివారిని తిల తైల అభిషేకాలు హోమాలు,వ్రతాలు నామస్మరణ విశేష ఫలితాలు ఇస్తాయన్నారు. తెలంగాణ ఆంధ్ర కర్ణాటక మహారాష్ట్రల వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులచే సామూహిక శనేశ్వర వ్రతాలు 519 జంటలచే వేదమూర్తులైన బ్రాహ్మణోత్తములచే శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్తీక మాసము శనివారము మాస శివరాత్రి -మిగతా4లో..



వేదమంత్రోచరణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్న వ్రతాలు

## మాలల సింహగర్జనకు తరలిన మాలదండు

**మహబూబ్‌నగర్,డిసెంబరు 1 ప్రభాతవార్త:** హైదరాబాదులో జరిగే మాలల సింహ గర్జన సభకు ఆదివారం మహబూబ్నగర్ జిల్లా నుంచి వేలాదిగా తరలి వెళ్లారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వివిధ మండలాల నుంచి మాలల జేఏసీ నాయకులు తండోప తాండాలుగా వచ్చి నిరసన తెలుపుతూ, మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ కు



హైదరాబాద్ తరలుతున్న నాయకులు

పూలమాలలతో నివాళులు అర్పించి, మాలల సింహగర్జన సభ ర్యాలీ తీసి హైదరాబాద్‌కు తరలారు. ఈ సందర్భంగా మాలల జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ మంత్రి నరసింహయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని, ఎస్సీ వర్గీకరణ రద్దుచేసి,ఎస్సీల రిజర్వేషన్లు పెంచి ఎస్సీల సంక్షేమానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల జేఏసీ నాయకులు ఎత్తప కేశవులు, కాడం రాఘవేందర్, చెన్నకేశవులు, శ్రీను,నరేష్, బాలు,తిరుపతి, రఘు, శ్రీను, శివ, కథలయ్య, ఆంజనేయులు, బాబు,వెంకట్,బాలయ్య, రామ చంద్రయ్య, మాల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీలకు 20శాతం రిజర్వేషన్ కావాలి

**కృష్ణ, డిసెంబరు 1 ప్రభాతవార్త:** ఎస్సీలకు కావాల్సింది వర్గీకరణ కాదని 20 శాతం రిజర్వేషన్ కావాలని మండల మాల మహానాడు మండల అధ్యక్షుడు మహాదేవ్ అన్నారు. ఆదివారం నాడు హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జనకు ప్రత్యేక వాహనంలో బయలుదేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో రెండో స్థానంలో ఉన్న మాలలు తమ సత్తా చూపిస్తామని, రాష్ట్రంలో పెరిగిన ఎస్సీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ పెంచాలని ఎస్సీలకు



మాలల సింహగర్జనకు తరలివెళ్తున్న దృశ్యం

కావాల్సింది వర్గీకరణ కాదని 20 శాతం రిజర్వేషన్ అవసరం ఉందని అన్నారు. నేడు జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని హిందూపూర్, చేగుంట ముడుమల్, అయినాపూర్, ఆలపల్లి,తంగడిగి, వివిధ గ్రామాల నుంచి ప్రత్యేక వాహనంలో హైదారాబాద్‌కు బయలుదేరారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, సుభాష్, వెంకటేష్, శ్రీనివాస్, కృష్ణ, బాలు, మహాదేవ్, మారుతి, సురేష్ తదితరులు ఉన్నారు.

## శివాలయంలో ప్రత్యేక పూజలు..

**దేవరకద్ర,డిసెంబరు 1 ప్రభాతవార్త :** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కార్తీకమాసం ముగింపు సందర్భంగా దేవస్థానంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది కార్తీకమాసం ముగింపు సందర్భంగా పలు పూజా కార్యక్రమాలను శివాలయంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగానే దేవాలయంలోని శివాలయంలో అర్చకుడు తరిమల హరిశంకరశర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాన్ని ఘనంగా



నిర్వహించారు.ఈ సందర్భంగా శివలింగానికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శివలింగాన్ని అలంకరించి ప్రత్యేక అర్చనలు, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళులు

**నారాయణపేట టౌన్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** తెలంగాణ సాధనలో అమరులైన పోలీస్ కిష్టయ్య ముదిరాజ్ వర్ధంతి వేడుకలను ఆదివారం దామరగిద్ద మండల కేంద్రంలో ముదిరాజ్ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ సాధనలో అమరులైన పోలీస్ కిష్టన్న ముదిరాజ్ త్యాగం మరువలేనిది అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే తమ



పోలీస్ కిష్టయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

బతుకులు మారుతాయని పేర్కొంటూ మరణ వాంగ్మూలం రాసుకుని కామారెడ్డి పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ టవర్ ఎక్కి 01 డిసెంబర్ 2009న సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మార్పణం చేసుకున్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నీలి వెంకట్రా రాములు, జల్లప్ప, ఉల్లిగుండం, చాపలి శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

## నవోదయ ఆసుపత్రి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం

**కోయిల్‌కొండ, డిసెంబరు 1 ప్రభాతవార్త :** ఆదివారం అమావాస్యను పురస్కరించుకొని మండల కేంద్రమైన కోయిల్‌కొండలో వెలసిన శ్రీరామ పాదాన్ని దర్శించుకునేందుకు వేలాదిగ తరలివచ్చిన భక్తజనానికి నారాయణపేట టిఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి, నవోదయ విద్యాసంస్థల అధినేత ఎస్. రవీందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. శ్రీరామకొండ దివ్య క్షేత్రంలో జరిగే అన్ని పర్వదినాలకు భక్తుల కోసం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని నవోదయ విద్యాసంస్థల అధినేత ఎస్ రవీందర్‌రెడ్డి అన్నారు. అనంతరం ఆయన మండల టిఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి శ్రీరాముని దర్శించుకున్నారు. ప్రతి అమావాస్యకు భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని మండల కేంద్రానికి చెందిన సిరాజుద్దీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్, మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బి కృష్ణ, మండల టిఆర్ఎస్ పార్టీ నేతలు వెన్న చెడు శ్రీనివాస్ రెడ్డి, మల్లయ్య యాదవ్, మండల సింగిల్‌విండో చైర్మన్ శ్రీని వాస్ రెడ్డి, మోదీపూర్ గ్రామ మాజీ సర్పంచ్ బి. రవి, రాంపూర్ మాజీ సర్పంచ్ రాములు యాద వ్, కె.రాజు, నజీముద్దీన్, లక్ష్మినారాయణ గౌడ్, సోహెల్, తదితరులు పాల్గొన్నారు.

## వైద్యశాఖ ఆధ్వర్యంలో ఎయిడ్స్ దినోత్సవం

**గద్వాల డిసెంబర్ 01 ప్రభాతవార్త :** ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గద్వాల కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తా నుంచి పాత డిఎమ్ ఎండ్ హెచ్ఓ కార్యాలయం వరకు వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు ఎయిడ్స్ వ్యాధి గురించి అవగాహన కల్పించే నినాదాలు




కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సిద్ధప్ప

ఇస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని గ్రంధాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారి డాక్టర్ ఎస్.కె సిద్ధప్ప జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీఎల్ఎస్ఏ కార్యదర్శి గంట కవితా దేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి గంటా కవిత, డిఎం ఎండ్ హెచ్ఓ సిద్ధప్ప లు మాట్లాడుతూ జిల్లాలో ఎయిడ్స్ పరిమితిని తగ్గించుటకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్న ప్రతి ఒక్క సిబ్బందికి, అత్యుత్తమ సేవలు అందించిన ఎన్జీవోలకి హెల్త్ వర్కర్లకి అప్రిసియేషన్ సర్టిఫికెట్స్, మొమెంటులను పంపిణీ చేశారు.

# తిరుచ్చివాహనంపై ఊరేగిన వెంకటేశ్వరస్వామివారు

**- అలంకరణలో శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారు - స్వామివారిని దర్శించుకొని తరించిన భక్తులు**

దేవరకద్ర,డిసెంబరు 01 ప్రభాతవార్త: జిల్లాలోని పేరెన్నికగన్న మన్యంకొండ శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు తిరుచ్చిసేవపై స్వామివారిని ఊరేగించారు. ప్రతి శనివారం రాత్రి స్వామివారి తిరుచ్చిసేవ కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా దేవస్థానం గర్భగుడి నుండి దేవస్థానం ముందున్న రథ మండపం వరకు శ్రీదేవిభూధేవి సమేతంగా స్వామివారి తిరుచ్చిసేవను ధక్షిణకట్ట వరకు నిర్వహించారు. అక్కడ కూడ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.పురోహితుల వేధమంత్రాలు,భక్తుల హరినామశ్చరణ,కాగడాల వెలుతురులో స్వామివారి సేవ ముందుకు కదిలింది. ఈ సేవను చూసి భక్తులు భక్తిపారవశ్యంతో పులకరించిపోయారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు.అనంతరం స్వామి వారిని మళ్ళి గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. అక్కడ వివిద పూజలను నిర్వహించారు. ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు.

**అలంకరణలో దర్శనమిచ్చిన స్వామివారు..**

మన్యంకొండలో తిరుచ్చిసేవ సందర్భంగా స్వామి వారు తిరుచ్చిసే



స్వామి వారికి హారతి ఇస్తున్న అర్చకుడు

వపై శ్రీదేవిభూధేవి సమేతంగా ఊరేగుతూ అలంకరణలో భక్తకోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు,బంగారు ఆభరణాలతో స్వామివారిని అలంకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ అళహరి మధుసూధన్‌కుమార్,అళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు,ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మయ్య,పాలకమండలి సభ్యులు,పర్యవేక్షకుడు



మన్యంకొండలో స్వామి వారి తిరుచ్చిసేవ నిర్వహిస్తున్న పురోహితులు

నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్,నారాయణరెడ్డి,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు భరోసాపై భరోసా ఇవ్వని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.యాదగిరి**

**నారాయణపేట టౌన్, డిసెంబరు1 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ రైతు సదస్సులో రైతు భరోసా, పూర్తిస్థాయి రుణమాఫీ గురించి రైతులకు ఏ భరోసా ఇవ్వలేదని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం ఎఐపికెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. యాదగిరి, జిల్లా ఉపాధ్యక్షులు చెన్నారెడ్డిలు రైతు భరోసా ఇవ్వకుండా రైతులు పండుగ ఎలా చేసుకుంటారని ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మహబూబ్ నగర్ వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాకు వరాల జల్లు కురిపిస్తాడు అనుకున్న రైతుల, ప్రజల ఆశలను నిరాశ పరిచారన్నారు సభకు ముఖ్యమంత్రి హాజరవుతున్నాడు అనగానే రైతులు యాసంగి పెట్టుబడికి డోఖా లేదనుకున్నారు. ముఖ్యంగా రైతులకు రైతు భరోసా నిధుల విడుదల పై ముఖ్యమంత్రి నోట రైతు భరోసా మాట ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసిన రైతన్న రేవంతన్న నోట



కార్యదర్శి బి.యాదగిరి

ఆ ప్రకటన రాకపోవడంతో బహిరంగ సభలో ఉన్న రైతులు తీవ్రమైన నిరాశ నిస్పృహలకు గురై ఒకరికొకరు చెవులు కొరుక్కోవడం యాసంగి పెట్టుబడి ఎలా అని దిగులు చెందారన్నారు. ఋణ మాఫికి సంబందించి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 20 లక్షల మందికి రూ. 2 లక్షల అప్పు కల్గినవారు ఉంటే మొత్తం మాఫీ చేయకుండా సాంకేతిక కారణాలతో ఆగిపోయిన రూ.3 లక్షలపై చిలుకు రైతులకు మాత్రమే మాఫీ చేసి చేతులు దులుపుకున్నారు. పూర్తిస్థాయిలో ఋణ మాఫీ, రైతుభరోసా ఇవ్వకుండా రైతులు పండగ ఎలా చేసుకుంటారని ప్రశ్నించారు. తక్షణమే రుణమాఫీ, రైతు భరోసా అందజేయలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ప్రజాపాలన విజయోత్సవాలపై విద్యార్థులకు పోటీలు

**భూత్పూర్,డిసెంబర్1,ప్రభాతవార్త:**రాష్ట్రప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవం సందర్భంగా ఆదివారం మండల స్థాయిలో వివిధ పాఠశాలల తొమ్మిది,పదో తరగతి విద్యార్థులకు ప్రజాపాలన విజయోత్సవాల శక్తి పునరుత్పాదనం అన్న అంశంపై స్థానిక జెడ్పీ ఉన్నత పాఠ శాలలో వ్యాసరచన,వక్తృత్వ పోటీలు నిర్వహించారు.వ్యాసరచన పోటీలో కరివెన జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎం మౌనిక,కొత్తమొల్గర జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బషీరా బేగం, కస్తూరిభా బాలికల విద్యాలయం భూత్పూర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని కవితలు విజేతలుగా నిలువగా, వక్తృత్వ పోటీలలో ఎంజెపిటీ భూత్పూర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని ఎ వైష్ణవి,కేజీబీవీకి చెందిన పదో తరగతి విద్యార్థిని



జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థినులు

సునీత,ఎంజెపీటీకి చెందిన భూత్పూర్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని కె వైష్ణవి విజేతలుగా నిలిచారు.వీరిని సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జిల్లా స్థాయి ఎంపిక కోసం పంపుతున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఉషారాణి తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు ఇక్రమ్,లాగూర్,నాగేంద్రలతో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయలు పాల్గొన్నారు.

## నార్లోనికుంటలో కొనసాగుతున్న శివాంజనేయస్వామి ఉత్సవాలు

**- వైభవంగా అఖండభజన - రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి**

**దేవరకద్ర,డిసెంబరు 01 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలోని నార్లోనికుంటలో శివాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి ఉత్సవాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగానే నార్లోనికుంటలో శివాంజనేయస్వామి ఉత్సవాలలో భాగంగా అఖండభజన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత నెల 29 నుండి దేవస్థానంలో ఉత్సవాలు జరుగుతున్నాయి. అలాగే స్వామి వారికి ప్రత్యేక అభిషేకం,తదితర పూజా కార్యక్రమాలను కూడ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూల విగ్రహాన్ని వెండి ఆభరణాలు,రకరకాల పూలతో అలంకరించారు. శివాంజనేయస్వామి ఉత్సవాలలో భాగంగా దేవస్థానంలో వేదపండితుల అధ్వర్యంలో శివరామకోటి జపయజ్ఞ గీతాజ్ఞాన యజ్ఞం సామూహిక గీతావహనం కార్యక్రమాన్ని కూడ సాంప్రదాయరీతిలో నిర్వహిస్తున్నారు. శివరామకోటి జపయజ్ఞ సర్వాధ్యక్షులు, హైద్రాబాద్‌లోని ఘట్‌కేసర్ ఆత్మబోధ పీఠం సదానంద యోగీశ్వరుల అధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే అఖండభజన కార్యక్రమాన్ని కూడ ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో ప్రత్యేక హోమం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవాల సందర్భంగా దేవస్థానాన్ని రంగురంగుల విధ్యుత్ బల్బులతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి మూలవిరాట్

**రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి:** దేవరకద్ర మండలంలోని నార్లోనికుంటలో శివాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారి రథోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం తెల్లవారుజామున ఈ రథోత్సవం జరుదనుంది. ఈ సందర్భంగా స్వామివారి రథానికి రంగులు వేసి ముస్తాబు చేశారు. రథోత్సవం రోజు శోభాయమానంగా అలంకరించిన రథంపై స్వామివారిని గ్రామ పురవీధుల గూండా ఊరేగిస్తారు. అనంతరం పల్లకిసేవ,స్వామి వారి ఊరేగింపు తదితర పూజా కార్యమాలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు,ఉత్సవ నిర్వహకులు తెలిపారు. కావున భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శివాంజనేయస్వామి కృపకు పాతృలు కావాలని వారు కోరారు.

## కొత్తకోటలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**కొత్తకోట డిసెంబర్ 01 ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం మండల వనరుల కేంద్రం కొత్తకోటలోని ప్రభుత్వ పాఠశాలలో వ్యాసరచన పోటీలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు వ్యాస రచనలో పాల్గొన్నారు. ఈ పోటీల ప్రారంభానికి ముందు జిల్లా విద్యాశాఖ కమ్యూనిటీ మొబిలైజింగ్ ఆఫీసర్ యుగంధర్ పాల్గొని విద్యార్థులకు ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు. అలాగే వ్యాసరచన పోటీలను పరిశీలించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతితులుగా మదనాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ పాల్గొని విద్యార్థులు ప్రభుత్వం అందించే సౌకర్యాలను ఉపయోగించుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఇందులో తెలుగు మీడియం నుండి మొదటి స్థానంలో బీ మమత, రెండవ స్థానంలో ఎన్ మహేశ్వరి, మూడవ స్థానంలో జె సంగీత నిలిచారు. ఇంగ్లీష్ మీడియం నుండి మొదటి స్థానంలో ఎన్ వైష్ణవి, రెండవ స్థానంలో ఎం జాహ్నవి, బి మనోజ్ కుమార్ ఎన్నికైయ్యారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ పి చంద్రశేఖర్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వి శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కో ఆప్షన్ జే ఎం మిషేక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిమపల్లి, జిల్లా కార్యదర్శి కృష్ణారెడ్డి, జేసిబి రాములు, ఉపాధ్యాయులు దేవన్న, లక్ష్మయ్య, మునీంద్రమ్మ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం

**సిపిఎం జిల్లా నాయకులు, బి వెంకటేష్**

**అమరచింత డిసెంబరు 01 ప్రభాతవార్త :** ఎన్నికలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల పరిష్కారం కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలకు సిద్ధమవుతామని సిపిఎం వనపర్తి జిల్లా నాయకులు, బి వెంకటేష్ అన్నారు. ఆదివారం అమరచింత మండలంలోని పామిరెడ్డి పల్లె గ్రామంలో సిపిఎం గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించడంలో ఘోరంగా వైఫల్యం చెందిందని ఆయన విమర్శించారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ రంగాలకు దారా దత్తం చేయడానికి పూనుకుందని ఆయన అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇందిరమ్మ ఇండ్లు,



సిపిఎం గ్రామసభలో మాట్లాడుతున్న బి వెంకటేష్

పెన్షన్లు ఇస్తామని వాగ్దానం చేసిన తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు 11 నెలలు గడుస్తున్న ఇప్పటివరకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడం లేదని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ లు అవలంబిస్తున్న నూతన ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం పార్టీ పోరాటాలకు సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్ ,మోహన్ ,రాజు ,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు




విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం దామరగిద్ద మండల కేంద్రంలో విద్యార్థులకు మండలస్థాయి వ్యాసరచనపోటీలు నిర్వహించారు.విజేతలైన వారికి మండలవిద్యాశాఖ అధికారి కృష్ణారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి వెంకటమ్మ జడ్పీహెచ్ఎస్ కంసాన్ పల్లి,రెండవ బహుమతి సిహెచ్ పూజ కంసాన్ పల్లి, మూడవ బహుమతి నాజ్మీన్ జడ్పీహెచ్ఎస్ కానుకుర్తి కైవసం చేసుకున్నారు. వ్యాసరచన పోటీలో పాల్గొన్న వారందరికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లిఖార్జున్, సత్యనారాయణ రెడ్డి, అంజయ్య, సంతోష్, రెడ్డప్ప, అంజిలప్ప, మాణిక్యప్ప, రఘువీర్‌గౌడ్, సిఆర్‌పి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## సింహగర్జన సభకు తరలి వెళ్లిన నేతలు



సమావేశానికి తరలి వెళ్తున్న నేతలు

**కోయిల్‌కొండ, డిసెంబరు 1 ప్రభాతవార్త :** హైదరాబాదులో జరుగుతున్న మాలల సింహ గర్జన సభకు ఆదివారం మండల కేంద్రమైన కోయిలకొండ నుంచి నేతలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. మాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ సమావేశం హైదరాబాదులో నిర్వహించడం జరిగిందని మాజీ ఎంపిటిసి బండి యాదవ్ కుమార్, మాజీ సర్పంచ్ జి రాజ్‌కుమార్ లు తెలిపారు. మాలల ఐక్యతారాగం ఈ సమావేశంలో వినిపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు రమేష్, అనిల్ కుమార్, ఆంజనేయులు,రాజశేఖర్, శ్రీనివాసులు,బండినాగరాజు,నవీన్,రాకేష్, భాను, సాయిలు, వెంకటయ్య, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే చేపట్టాలి

**నారాయణపేట టౌన్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** నారాయణపేట కొడంగల్ ప్రాజెక్ట్ కోసం అనేక సంవత్సరాలుగా పోరాడి సాధించుకున్న ప్రాజెక్టు మంజూరయ్యి, టెండర్లు కూడ పూర్తయి నెలలు గడుస్తున్నా ప్రాజెక్ట్ పనులు ఎందుకు చేపట్టడం లేదని సిపియం జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాల్ ప్రశ్నించారు. ఆదివారం ఒక ప్రకటనలో మాట్లా



డుతూ కాంగ్రెస్ పార్టి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రతి మహిళకు రూ.2500 భూమిలేని వ్యవసాయకూలి కుటుంబాలకు సంవత్సరానికి రూ.12000లు ఇస్తామని మోసం చేసిందన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15000లు ఇస్తామని దాని ఊసెత్తడం లేదన్నారు. పేదలకు ఇండ్లు, రేషన్ కార్డులు ఇస్తామని ప్రచారానికి పరిమితమై కాలయాపన చేయడం తప్ప మంజూరు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు.

## దేవస్థానానికి విరాళం అందజేత



విరాళాన్ని అందజేస్తున్న పాశం శేఖర్‌యాదవ్

**దేవరకద్ర,డిసెంబరు 01 ప్రభాతవార్త:** కౌకుంట్ల మండలం పేరూర్ గ్రామశివారులోని శ్రీ అడవిఆంజనేయస్వామి దేవస్థానానికి గ్రామానికి చెందిన పాశం శేఖర్‌యాదవ్ రూ.10 వేల విరాళాన్ని అందజేశారు.దేవస్థానంలో ఆదివారం దేవస్థానం కమిటి వార్షిక సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు చిలుక ఆంజనేయులు,ప్రధాన కార్యదర్శి ఆర్‌సి శ్రీనివాసులులకు ఈ విరాళాన్ని పాశం శేఖర్‌యాదవ్ అందజేశారు.ఈ కార్యక్రమంలో చిలుక రాంచందర్,యం.కృష్ణయ్య,చిలుక ఆంజనేయులు,నాగరాల ఆంజనేయులు,ఆర్‌బి.శ్రీనివాసులు,ఆర్‌బి.సత్యనారాయణ,గౌనియాదవ్‌సాగర్,గౌని రవిసాగర్,చిలుక బీసన్న,,గౌని విష్ణు తదతర గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు పండుగ విజయవంతం

**పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్**



**అమరచింత డిసెంబరు 01 ప్రభాతవార్త :** ఉమ్మడి పాలమూరు జిల్లా అమిస్తాపూర్ లో జరిగిన రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరైన రైతు పండుగ సభకు భారీ ఎత్తున రైతులు హాజరై సభను విజయవంతం చేసిన రైతన్నలకు పిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి, కేశం నాగరాజుగౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులకు రెండు లక్షల రుణమాఫీ దేశ చరిత్రలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదర్శంగా నిలిచారని ఆయన అన్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 500 కే సిలిండర్ 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు తో పాటు రైతులకు బోనస్ ఇచ్చిన గణిత కాంగ్రెస్ పార్టీదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీపై చూపుతున్న ఆదరణను చూసి టిఆర్ఎస్ బిజెపి పార్టీలు ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని ప్రజలు తిప్పి కొట్టాలని ఆయన కోరారు.

## ప్రజలకు చేరువైతేనే సమన్యాయం జరుగుతుంది



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

**ఆత్మకూరు, డిసెంబరు 01 ప్రభాతవార్త :** సమాజంలో పోలీసులు ప్రజలకు చేరువైతేనే ప్రజలకు సమన్యాయం జరుగుతుందని వనపర్తి జిల్లా డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం రోజు ఆత్మ కూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో జరిగిన ఏఎస్ఐ బీచుపల్లి పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు పైరవీలకు తావివ్వకుండా సామాన్య ప్రజలకు చేరువైనప్పుడే అందరికీ సమన్యాయం చేయగలిగిన వారం అవుతామని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి పోలీసు ప్రజలకు న్యాయం చేసేందుకు తమ వంతు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. 36 సంవత్సరాల పాటు ఏఎస్సైగా విధులు నిర్వహించి పదవి విరమణ పొందుతున్న బీచుపల్లి దంపతులను డిఎస్పీ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూర్ సీఐ శివకుమార్ అధ్యక్షత వహించగా ఎస్సై నరేందర్ అమరచింత, మదనాపూర్ మండలాలకు చెందిన ఎస్ఐలు పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంటరాని తనాన్ని ఏ రూపంలో ప్రదర్శించిన నేరమే



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**మక్తల్‌టౌన్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** అంటరానితనంను ఏ రూపంలో ప్రదర్శించిన వారిపై చట్టపరమైన చర్యలకు వెనకడబోమని గిర్ధవర్ విజయకుమార్ తెలియజేశారు. మక్తల్ నియోజకవర్గ పరిధిలో మారుమూల గ్రామాల్లో కుల వివక్షతలు, ప్రదర్శించిన అధికారుల దృష్టికి తీసుకురావాలని తక్షణమే వారిపై చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని ఎఎస్సై తెలియజేశారు. పౌర హక్కుల పరిరక్షణ లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో కేశవనగర్ లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. సామాజిక సమానత్వం దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని అంటరాని తనంను ప్రదర్శిస్తే వెంటనే కేసులు నమోదు చేస్తామని ప్రజలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రాజ్యాంగం అందరికి సమాన ఫలాలు,సమాన హక్కులు కల్పించింది అని ప్రజలకు ఎక్కడ హక్కులకు భంగం కలిగిన,రక్షణ పరమైన అభద్రతకు గురి అయిన పోలీస్ స్టేషన్ కు,న్యాయ స్థానాలను ఆశ్రయించాలి అని తెలియజేశారు.రాజ్యాంగం లో ఆర్టికల్ 17 దళిత, బడుగు వర్గాలకు రక్షణ కల్పించింది అని ఆర్టికల్ 17 పకడ్బందీగా ప్రభుత్వం అమలుచేసే లక్ష్యంతో చైతన్యం కలిపిస్తూ అవగాహన కల్పించారు. అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కర్రెమ్ కుర్మయ్య,అంబేద్కర్ యువజన సంఘం మాజీ అధ్యక్షుడు జె.నర్సిములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ, ఎఎస్సై కానిస్టేబుల్ మనోహర్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అమరుడు పోలీస్ కృష్ణయ్య ముదిరాజ్ ఆశయాలు కొనసాగిద్దాం



పోలీస్ కిష్టయ్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** జ్యోతిరావు పూలే బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈసరి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో మలిదశ తెలంగాణ పోరాట తొలి అమరుడు పోలీస్ కృష్ణయ్య 15వ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో పూల మాల వేసి నివాళులు అర్పించిన జ్యోతిరావు పూలే బీసీ సంఘం నాయకులు. ఈ సందర్భంగా కోళ్ల వెంకటేష్ మాజీ ఎంపిటిసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారులను అమరులైన కుటుంబాలను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్ కృష్ణయ్య 15వ వర్ధంతినీ ప్రభుత్వం, పోలీస్ అధికారులు అధికారికంగా నిర్వహించాలని కోరడం జరిగినది. జ్యోతి రావు పూలే బీసీ సంఘం వ్యవస్థాపకులు వాకిటి ఆంజనేయులు ముదిరాజ్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాలు యువత, మహిళా,ఉద్యోగులు,విద్యార్థి మత్స్యసహకారసంఘాలు గ్రామగ్రామాన ఈకార్యక్రమాన్ని నిర్వహించవలసిందిగా కోరుతున్నట్లు ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లాలోనీ అన్ని మండల కేంద్రాలలో డిసెంబర్ 1 తేదిన గ్రామ నడిబొడ్డున అమరవీరుల స్థూపం దగ్గర అమరుడు పోలీస్ కిష్టయ్యకు ఘనంగా నివాళు అర్పించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మూర్తి, రఘుసాగర్, నాగరాజ్, లక్ష్మణ్, కిష్టప్ప, రవి గోవిందు పాల్గొన్నారు.

## బీచుపల్లి పుణ్యక్షేత్రంలో ఆలయాలలో భక్తుల పూజలు



శివాలయం వద్ద పూజలు చేసేందుకు వచ్చిన మహిళలు

**ఇటిక్యాల, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కార్తీక మాసం సందర్భంగా ఆదివారం అమావాస్య కావడంతో చివరి కార్తీక మాసం పురస్కరించుకొని ఆదివారం ఉదయం నుండి బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం.కోదండ రామాలయం. కృష్ణా నది పుష్కర ఘాట్ సమీపంలో ఉన్న శివాలయంలో భక్తులు పుణ్యక్షేత్రానికి చేరుకొని ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య కావడంతో ఆంజనేయ స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. నెలరోజుల పాటు భక్తులు కార్తీక మాసం భక్తశ్రద్ధలతో జరుపుకున్నారు. శివాలయం వద్ద ఉన్న నవగ్రహాలకు మహిళ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పుణ్యక్షేత్రం ఆలయాలలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్తీక మాసం చివరి రోజు కావడంతో బీచుపల్లి పుణ్యక్షేత్రం లో భక్తుల సందడి నెలకొంది..

## అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తాం!

**ప్రముఖ చేనేత వ్యాపారస్తులు మహంకాళి శ్రీనివాసులు**

**అమరచింత డిసెంబరు 01 ప్రభాతవార్త :** అయ్యప్ప స్వాములకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తామని ప్రముఖ చేనేత వ్యాపారస్తులు మహంకాళి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని శివ చౌడేశ్వరి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అయ్యప్ప స్వాములు 41 రోజులు కఠోర దీక్షలతో అయ్యప్ప స్వామి పూజలు అయ్యప్ప స్వాములు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ అయ్యప్ప స్వామి సన్మార్గంలో సమాజిక సేవ దృక్పథంతో అయ్యప్ప స్వాములు ముందుండాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి గంగాధర్ ,మాజీ ఎంపిటిసి మహంకాళి విష్ణు ,గురు స్వాములు మాకం నర్సింలు ,వీరితోపాటు అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం



**కల్వకుర్తి, డిసెంబరు 01 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం జిల్లెల్ల గ్రామంలో దార సాయమ్మ అనా రోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ సర్పంచ్ జిల్లెల్ల రాములు మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి, మృతురాలి భర్త దార జంగయ్యకు ఆర్థిక సహాయం అందించారు. మృతురాలి కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉండి ఆదుకుంటామని భరోసా ఇచ్చారు .ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ కొమ్మగోని రవిగౌడ్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,దేవాలయ వైస్ ఛైర్మెన్ శ్యామ్ సుందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షుడు గుమ్మకొండ మహేందర్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎముక శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# అసమానతలు లేని విద్యను అందించాలి

**టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దేవేందర్**




మాట్లాడుతున్న టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** భారతదేశంలో అసమానతలు లేని విద్యను విద్యార్థులకు అందించాలని టీపీటీఫ్ జిల్లా అధ్యక్షులు దేవందర్ అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థుల ఐక్యత (పిడిఎస్‌యు)జిల్లా జనరల్ కౌన్సిల్‌ను ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంతో బాటు దామరిగిద్ద మండలం, ఉద్మల్ గిద్ద గ్రామంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యాలయాలలో విద్యార్థులకు భవిష్యత్ లో ఉపయోగపడే విద్యను అందించాలని ఉన్నోడికి ఒక్క విద్య లేనోడికి ఒక్క విద్య అని రెండు రకాల విద్య విధానం మన దేశంలో ఉందన్నారు. ననేడు విద్య చదువుకుంటే చదువురాదు చదుకోంటే చదువు వస్తదాని తీరు నేడు దేశంలో కొనసాగుతుందన్నారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం మళ్ళీ విద్య సంస్థలలో వ్యవస్థ ను పూర్తిగా కాషాయకరణ వైపు తీసుకుపోతుంది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాని పూర్తిగా విస్మరించి ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని నియమించలేదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశలో నేడు ప్రభుత్వం లేదన్నారు. ఉచితాల పేరుతోనే కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. అనంతరం పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు పి. రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విద్యారంగాని విస్మరించి ప్రయివేట్,కార్పొరేట్ విద్య సంస్థలకు కొమ్ముకాస్తుందన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలలో, హాస్టల్ లో, గురుకులాల్లో, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం పూర్తిగా విషంగా మారిపోతుందన్నారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసి అస్పత్రుల పాలవుతున్నారు అన్నారు. రాష్ట్రంలో మూడు సంవత్సరాల నుండి ఇప్పటివరకు విద్యార్థులకు రావాల్సిన రూ.650 కోట్ల ఫీజ్ రియాంబర్స్ మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. ఇబ్బందుల మధ్య విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. పిడిఎస్‌యు సంస్థ జెండాను పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయికుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి. భాస్కర్ అజయ్, సంధ్య,గౌస్, జిల్లా కోశాధికారి వెంకటేష్, శేఖర్ అజయ్, మహేష్, పుష్పలత, అఖిల, సురేష్, ప్రేమ్ రాజు, సాగర్, అరుణ, వైష్ణవి, నందిని లక్ష్మి, అనిత,అరుణ, రాజు,సురేష్,విక్టర్ విద్యార్థులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ రెడ్డిది అభివృద్ధి తక్కువ.. అవినీతి ఎక్కువ

**బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బోయ హన్మంతు నాయుడు**



సమవేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు

**గద్వాల, డిసెంబరు 01 ప్రభాతవార్త :** సిఎం రేవంత్ రెడ్డిది అభివృద్ధి తక్కువ, అవినీతి ఎక్కువ అని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బోయ హన్మంత్ నాయుడు ఆరోపించారు. మంత్రులచేత చప్పట్లు కొట్టించుకునే సీఎంను దేశంలో ఎక్కడా చూడలేదని ఎద్దేవ చేశారు.అభివృద్ధి జరగాలంటే రైతులు నష్టపోవాలని చెబుతున్నానని చెప్పి పాలమూరు సభ సాక్షిగా ఏ రైతులను బెదిరిస్తున్నావు అని హన్మంత్ నాయుడు ప్రశ్నించారు.పాలమూరు బిడ్డగా ఇది నీకు న్యాయమేనా అని ప్రశ్నించారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాసు హనుమంతు నాయుడు సిఎం రేవంత్ రెడ్డి పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుపండుగ పేరుతో కొడంగల్ లో భూములు ఇవ్వకుండా గిరిజన రైతులు ఎదురు తిరిగినందుకు రాష్ట్రంలోని రైతులను బెదిరించేందుకు ఈ సభ పెట్టినట్లుందన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసిఆర్ ఆధ్వర్యంలో నడిగడ్డలో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ చేసి నడిగడ్డలో ప్రతి ఎకరాకు సాగునీరందించి సస్యశ్యామలం చేశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఏడాది పాలనలో నడిగడ్డ ప్రాజెక్టులపైన ద్యాస పెట్టిండా అని ప్రశ్నించారు.రైతు పండగ సభ లో పాలమూరు తపన,పాలమూరు ధ్యాస,పాలమూరు వేదన ఎక్కడా నీలో ప్రజలకు కనిపించలేదన్నారు.రేవంత్ రెడ్డి ప్రసంగం చూస్తే రైతుల పట్ల ప్రేమ కంటే గిరిజనుల నుంచి భూసేకరణ చేయడంలో ఘోరంగా విఫలమయ్యామనే ఆవేదనే కనిపించిందని, రేవంత్‌కు కౌంటర్ ఇచ్చారు. ఒకసారి ఫార్మాసిటీ అని గెజిట్ ఇచ్చి బీఆర్ఎస్ పోరాటంతో వెనక్కి తగ్గి ఇప్పుడు పారిశ్రామిక కారిడార్ అని ప్రచారం చేస్తున్నాడన్నారు. ఎటు వాటమైతే అటు మాట్లాడటం నీకే చెల్లింది అంటూ ఎద్దేవా చేశారు.పాలమూరు సభలో రేవంత్ ప్రసంగం ఆత్మస్తుతి, పరనిందలా సాగింది అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాములు,పార్టీ యువ నాయకులు తిరుమలేష్,గంజిపేట రాజు,ముని మోర్య,ఎండి.మాజ్,తిమ్మప్ప గౌడ్, గంగాధర్,కామేష్ మరియు పార్టీ నాయకులు,కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు విజయోత్సవ సభ విజయవంతం : మార్కెట్ కమిటీ ఛైర్మన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్

**కొత్తకోట డిసెంబరు 01 ప్రభాతవార్త :** మన పాలమూరు జిల్లాపై ప్రేమతో రైతు విజయోత్సవ సభకు లక్షకు పైగా రైతులు ప్రజలు హాజరై సభను విజయవంతం చేశారని,ఉమ్మడి మహబూబ్‌నగర్ లో తిరుగులేని శక్తిగా కాంగ్రెస్ పార్టీ ఉందని సంతోషం వ్యక్తం చేస్తూ సభను సక్సెస్ చేసినందుకు మదనాపురం మార్కెట్ కమిటీ ఛైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం కొత్తకోటలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఈ సభకు వేలాది మంది ప్రజలు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసుకొని సభకు తరలి వచ్చారని,అంతేకాకుండా మహాకుంభమేళాను తరలివచ్చేలా ప్రజలు పయనమై వచ్చారని,ఈ సభ విజయవంతానికి కష్టపడి చెమటోడ్చిన శ్రేణులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా వారం రోజులపాటు జిల్లాలోనే ఉండి, అందరు ఎమ్మెల్యేలను, నేతలను సమన్వయం చేసుకొని,అన్నీ తానై వ్యవహరించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ సభలో రైతులకు సంబందించిన దాదాపు 150 స్టాల్స్ ఏర్పాటు చేసి రైతులకు సాంకేతిక రైతంగంపై అవగాహన కల్పించడం గొప్ప విషయమన్నారు. రైతుల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంది అనడానికి ఈ సభ ఒక ఉదాహరణ అని అన్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఒక్క పిలుపుతో లక్షలాదిగా రైతులు, మహిళలు తరలిరావడం సభను విజయవంతం చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఈ సభను విజయవంతం చేసిన రైతులకు,మహిళలకు,ప్రభుత్వ అధికారులకు,కార్యకర్తలకు,పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సీడిసి ఛైర్మన్ గొల్ల బాబు,కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి,మండల అధ్యక్షుడు నాగారపు బీచుపల్లి, కో ఆప్షన్ సభ్యులు జేఏం మిషేఖ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మోహన్ రెడ్డి, ఫిషరిస్ మ్యాన్ సంద వెంకటేష్, మైనార్టీ సెల్ టౌన్ అధ్యక్షులు అజాజ్ అల్లి,టౌన్ యూత్అధ్యక్షులు నవీన్ రెడ్డి,చాంద్ పాషా,సలీమ్, మైన్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో నాలుగో విడత రైతు రుణమాఫీ రైతులు 8262 మంది

**రూ.81కోట్ల 97 లక్షల 38 వేల 851 రుణమాఫీ**

**ఇటిక్యాల డిసెంబరు 1 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాపూర్ లో మూడు రోజులపాటు రైతు పండుగను ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. రైతు పండుగ సభకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రైతు పండుగ ద్వారా రైతుల సమక్షంలో పెండింగ్ లో ఉన్న 4 వ విడత రైతుల రుణమాఫీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర మంత్రుల సమక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ. 2 లక్షల లోపు రుణమాఫీ ఉన్న రైతులకు 4వ విడత రుణ మాఫీ రూ.2 లక్షల విడుదల చేశారు. ఆధార్ కార్డులో ఇంటిపేరు, అకౌంటులో మరో పేరు ఇలా తప్పులు ఉండి, అలాగే రేషన్ కార్డు లేకుండా ఉండిన రైతులను వ్యవసాయ అధికారులు కుటుంబ నిర్ధారణ చేసిన చేసిన వారికి ప్రభుత్వం రుణమాఫీ చేయగా ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని 8 వేల 262 మంది రైతులకు రూ. 81 కోట్ల97 లక్షల38 వేల 851 రైతు రుణమాఫీ ప్రభుత్వం విడుదల చేసింది. జోగులాంబ గద్వాల జిల్లాలోని ఇటిక్యాల మండలంలో 900 మంది రైతులకు రూ. 9 కోట్ల 61 వేయి 593,అల్లంపూర్ మండలంలో 987 మంది రైతులకు రూ. 9 కోట్ల 44 లక్షల 89,వేల 501, మానవపాడు మండలంలో 695 మంది రైతులకు రూ. 6 కోట్ల 63 లక్షల 75 వేల 467, ఐజ మండలంలో 586 మంది రైతులు రూ. 5 కోట్ల 27 లక్షల 82 వేల 61, రాజోలి మండలంలో 487 మంది రైతులకు గాను రూ. 4 కోట్ల 41 లక్షల 25 వేల 63, ఉండవెల్లి మండలంలో 716 మంది రైతులకు 7 కోట్ల రూ.15 లక్షల 87 వేల 897, వడ్డేపల్లి మండలంలో 568 మంది రైతులకు రూ. 5 కోట్ల. 26 లక్షల 68 వేల 446, గద్వాల మండలంలో 772 మంది రైతులకు 7 కోట్ల88 లక్షల 45 వేల 459, గట్టు మండలంలో 590 మంది రైతులకు గాను రూ. 4 కోట్ల 99 లక్షల 68 వేల 850,ధరూరు మండలంలో 774 మంది రైతులకు రూ. 8 కోట్ల 36 లక్షల 44 వేల 62, కేటి దొడ్డి మండలంలో 707 మంది రైతులకు రూ.7 కోట్ల 28 లక్షల 47 వేల 576లు, మల్దకల్ మండలంలో 448 మంది రైతులకు రూ. 4 కోట్ల 78 లక్షల 30 వేల 356లు మొత్తం జోగులాంబ గద్వాల జిల్లాలో 8262 మంది రైతులకు రూ. 81 కోట్ల 97 లక్షల 38 వేల 851లను 4వ విడత ద్వారా రైతులు రుణమాఫీ ప్రభుత్వం మాఫీ చేసింది.

# సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాల మల్లేష్ మృతి

**సిపిఐకి తీరనిలోటు రాష్ట్ర సమితి సభ్యులు కె. కేశవులుగౌడ్**



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**తెలకపల్లి, డిసెంబర్ 1 ప్రభాతవార్త:** సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉద్యమాల కెరటం ఎన్. బాల మల్లేష్ మృతి చెందడం సిపిఐ పార్టీకి తీరని లోటని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే. కేశవులు గౌడ్, మండల కార్యదర్శి వి రవీందర్ లు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో కామ్రేడ్ ఎన్ బాల మల్లేష్, చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ గుండెపోటుతో శనివారం సాయంత్రం అకాల మరణం చెందారని వారి మరణం భారత కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వామపక్ష భావజాలంతో విద్యార్థి యువజన వివిధ ప్రజా సంఘాల్లో ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజా సమస్యల పైన నిరంతరం పోరాటాలు చేస్తూ ఎర్రజెండానే ప్రజలకు అండ అనే ఆకాంక్షతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను చైతన్య పరచిన గొప్ప ఉద్యమకారుడు అని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, ఎ ఐ వై ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శిగా, సి పి ఐ తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి స్థాయికి చేరారని పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం,పార్టీ కోసమే తమ తుది శ్వాస వరకు పోరాటాలు చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు ఎస్ శంకర్ గౌడ్ రైతు సంఘం అధ్యక్షులు డి బాలమురళి మండల కార్యదర్శి రవీందర్ ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ఏ వెంకట్‌స్వామి, జి. శంకర్, బ్రహ్మేందర్‌కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దేశమోని అంజి తదితరులు పాల్గొన్నారు .

## బోనస్‌తో రైతుల ఆనందం



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు

**కొత్తకోట డిసెంబర్ 01 ప్రభాతవార్త :** రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టంగా చేపట్టిన ధాన్యం కొనుగోలు చేసి ధాన్యం సేకరించిన వారంలోపే రైతుల ఖాతాలలో రూ. 500 బోనస్ నగదు విడుదల చేసి రైతుల జీవితాలలో వెలుగులు నింపిందని సంతోషం వ్యక్తం చేస్తూ కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి గ్రామ రైతులు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి, గ్రామ నాయకులు అమర్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేశారు. 500రూపాయలు బోనస్ పడడంతో రైతులు సంబరాలు చేసుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామ రైతులు, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి చెక్కు పంపిణీ చేసిన మాజీ జెడ్పీ ఛైర్ పర్సన్ సరితమ్మ



బాధత కుటుంబానికి ఎల్ఓసి లెటర్‌ను అందజేస్తున్న సరితమ్మ

**గద్వాల డిసెంబర్ 01 ప్రభాతవార్త:** అనారోగ్యంతో బాధపడుతున్న వారికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ జెడ్పీ ఛైర్మన్ సరితమ్మ సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. గద్వాల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సరితమ్మ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మల్దకల్ మండలం ఎల్కూర్ గ్రామానికి చెందిన మున్నెన్న ఆరోగ్య రీత్యా వైద్య సేవలకై సిఎం సహాయ నిధి లీవీది 60.000/- రూపాయల చెక్కును సరితమ్మ, మున్సిపల్ ఛైర్మన్ బిఎస్.కేశవ్‌తో కలిసి చెక్కను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్వాల రాజశేఖరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఇసాక్,పెదొడ్డి రామకృష్ణ,ఎల్కూర్ తిమ్మప్ప,డిటిడిసి నర్సింహులు,ఆనంద్‌గౌడ్,కుర్వశ్రీనివాసులు,చింతలకుంట గోవర్ధన్,గోపాల్ వర్మ,జంగం శేఖరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సింహగర్జన సభకు బయలుదేరి వెలుతున్న మాలలు



బయలుదేరి వెళ్తున్న మాల సంఘం నాయకులు, కార్యకర్తలు


**గద్వాల, డిసెంబరు 01 ప్రభాతవార్త :** మాలల సింహగర్జన సభకు వెళ్తున్న సందర్భంగా ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి మాల సంగం రాష్ట్ర కార్యదర్శి మాల శ్రీనివాసులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.గద్వాల తాలూకా నుండి మాలలు భారీగా బయలుదేరి వస్తున్న వారికి మాల సంగం జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాలల సంగం నాయకులు కృష్ణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ గర్జనకు తరలిన మాలలు



**అమరచింత డిసెంబర్ 01 ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ హైదరాబాదులో జరిగే మాలల సింహగర్జనకు ఆదివారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని మాలలు తరలి వెళ్లారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల కన్వీనర్ వేద విష్ణువర్ధన్ మాట్లాడుతూ, ఎస్సీ వర్గీకరణ వల్ల మాలల కు అన్ని రంగాలలో అన్యాయం జరుగుతుందని కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ఆమోదించకుండా తీర్మానం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేశం వెంకటస్వామి, రామస్వామి ,రాములు రామ్మూర్తి, వెంకట్ రాములు, శేఖర్ ,రమేష్, భార్గవ్ , పవన్, తదితరులు పాల్గొన్నారు.

## వీరభద్ర స్వామి దేవాలయం ఆవరణలో ఘనంగా అన్నదాన కార్యక్రమం



**ఖిల్లాఘణపురం డిసెంబరు 01 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని వీరన్న గట్టుపై వెలసిన భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయం ఆవరణలో ఆదివారం అమావాస్య సందర్భంగా కమ్మరి గోపి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా లాన్ టెన్నిస్ పోటీల్లో తెలంగాణకు బంగారు పతకం

**నారాయణపేట టౌన్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** బెంగళూరులో జరిగిన 25 వ ఆల్ ఇండియా నేషనల్ పోలీస్ లాన్ టెన్నిస్ డబుల్స్ లో భాగంగా తెలంగాణ రాష్ట్రం నుండి పోటీలో పాల్గొన్న మల్టి జోన్1, ఐజిపి చంద్రశేఖర్ రెడ్డి ఐపీఎస్, నారాయణపేట జిల్లా అడిషనల్ ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్ లు లాన్ టెన్నిస్ ఫైనల్‌లో స్వర్ణపతకం సాధించడం జరిగింది. 50 ప్లేస్‌లో తెలంగాణ జట్టుకు ఆంధ్ర ప్రదేశ్ జట్టు తో పోటీ పడగా ఫైనల్‌లో విజయం సాధించారు.

## భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసా..



స్వాములకు భిక్ష వడ్డిస్తున్న యెన్నం భూపతిరెడ్డి

**వెల్దండ, డిసెంబరు 01 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలో గ్రామ మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి నివాసంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా, అయ్యప్ప స్వామి పూజలు, రుద్రాభిషేకం, అభిషేక పూజలను యెన్నం భూపతిరెడ్డి దంపతులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా అయ్యప్ప స్వామి పూజలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. ఈ సందర్భంగా యెన్నం భూపతిరెడ్డి మాట్లాడుతూ భక్తి ద్వారానే ముక్తి లభిస్తుందని, ప్రతి ఒక్కరు దైవమార్గాన్ని అలవర్చుకోవాలని అన్నారు. అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించి స్వామి వార్ల ఆశీర్వచనం పొందారు. పూజా కార్యక్రమాలకు ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, నాయకులు సురేందర్ రెడ్డి, సంజీవ్‌కుమార్ యాదవ్,పర్వత్ రెడ్డి,యెన్నం కృష్ణారెడ్డి, అల్వాల్ రెడ్డి, ఉప్పు ఆంజనేయులు, మేడిశెట్టి సురేష్, సుధాకర్‌రెడ్డి, మట్ట వెంకటయ్య గౌడ్, సింహారెడ్డి, వెంకటయ్య, యన్నం శ్రీనివాస్ రెడ్డి, పుల్లయ్య, పుష్పగిరిరావు, వెంకట్ సాగర్, రామాచారి, పంచాయతీ కార్యదర్శి గిరి, వికాస్, పూరి శివకుమార్ తో పాటు గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## పోలీస్ కిష్టయ్య సంస్కరణ సభ గోడపత్రిక విడుదల

**వెల్దండ, డిసెంబరు 01 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై గల అంబేద్కర్ విగ్రహం వద్ద తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన స్వర్గీయ పోలీస్ కిష్టయ్యకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సంస్కరణ సభ గోడపత్రికను ముదిరాజ్ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజ్ ముద్దుబిడ్డ పోలీస్ కిష్టయ్య త్యాగం మరువలేనిదని, చరిత్రలో నిలిచిపోయారని ఆయన వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కోరారు. నివాళులు అర్పించిన వారిలో జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ క్యాసారపు వెంకటయ్య, మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు మల్లేష్ ముదిరాజ్, ముదిరాజ్ నాయకులు లింగ ముదిరాజ్, కృష్ణ ముదిరాజ్, ఎర్ర శ్రీను ముదిరాజ్, గణేష్, నిరంజన్, దుర్గయ్య, జంగయ్య, మల్లేష్, విజయ్, ప్రశాంత్, ధనంజ య్, రమేష్,కొండల్, శ్రీను, బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

## నాసిరకం పనులకు నిదర్శనం

**-తెగినచోటే తెగిపోతున్న కేఎల్ఐ డి-82 కాలువలు**



తెగిన కేఎల్ఐ కాల్వ

**వెల్దండ, డిసెంబరు 01 ప్రభాతవార్త:** కాలువలద్వారా సాగునీరు అందుతాయని, ఈ బీడుబడ్డ ప్రాంతం రైతంగం అభివృద్ధి చెందుతుందనే ఆలోచనలతో గత ప్రభుత్వాలు కేఎల్ఐ డి-82 కాల్వకు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. కానీ వెల్దండ మండలానికి వచ్చేసరికి అప్పటి ప్రజాప్రతినిధులు అధికారులు కాలువలను పట్టించుకునే నాధుడే లేకుండా పోయారు. నాసిరకం పనులతో కాల్వల వెడల్పు కుదించి కాజ్‌వేలు, కల్వర్టులు ఇప్పటికే పగుళ్ల ఏర్పడ్డాయి. కాల్వల గట్టు గట్టితనం తగ్గిపోయింది. అప్పుడు నిర్మించినప్పుడే ప్రజా ప్రతినిధులు అధికారులు, కాంట్రాక్టర్‌తో నాణ్యతగా చేపట్టినట్లయితే కాలువలకు ఈ దుస్థితి రాకుండా ఉండేది. మండలంలో ఎక్కడో ఒక చోట కాలువకు గండ్లు పడి సాగు నీరు వృధాగా పారుతుంది. ఆదివారం గుండాల సమీపంలో కే ఎల్ ఐ డి-82 కాల్వకు సిమెంటు కాజువేకు అనుసంధానంగా ఉన్న మట్టి కాలువ కొట్టుక పోయి తెగిన చోటే తెగిపోవడంతో మట్టితో పూడ్చుతున్నారు. అయినా సరే ముచ్చటగా మూడోసారి కాల్వకు గండి పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఆర్టీసీ డ్రైవర్ను పరామర్శించిన మాజీ మంత్రి

**ఖిల్లాఘణపురం డిసెంబరు 01 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మామిడి మాడ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ అనే మోని శ్రీనివాసులు ఇటీవల ప్రమాదానికి గురై హైదరాబాదులోని మెడికవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆదివారం ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న శ్రీనివాసులు పరామర్శించారు ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి వర్గాలకు సూచించారు. భయపడవద్దని అన్ని రకాలుగా అండగా ఉంటానని బాధితుడికి ధైర్యం చెప్పారు. మంత్రి వెంబడి గ్రామానికి చెందిన గోవర్ధన్ రెడ్డి ఉన్నారు.

## వాసవి క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

**కల్వకుర్తి, డిసెంబరు 01 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని వాసవి క్లబ్ సేవా భవనంలో నిర్వహించిన సమావేశంలో 2025 సంవత్సరానికి వాసవి క్లబ్ కేసీజీఎఫ్ కల్వకుర్తి నూతనకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా బాదం రాఘవేందర్, ప్రధాన కార్యదర్శిగా నీల కోటేశ్వర్, కోశాధికారిగా మాచిపెద్ది రవికుమార్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరు రమేష్ బాబు, ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ కల్వ హరికృష్ణ, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కలిమిచెర్ల రమేష్‌లు పాల్గొని నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి క్లబ్ సేవలు విస్తరింప చేయాలని, గత సంవత్సరం కంటే ఎక్కువ సేవా కార్యక్రమాలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఆఫీసర్ గుగ్గిల్ల శంకర్, వాసవి క్లబ్ అధ్యక్షుడు చిదిరే శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి కల్వ ఆంజనేయులు, కోశాధికారి దుగ్గి అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు గుండ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

**రెండవసారి ఏకగ్రీవంగా కొత్త కమిటీ.. పెబ్బేరు నూతన కమిటీ ఏకగ్రీవ తీర్మానం**

**పెబ్బేరు డిసెంబరు 01 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణంలోని శ్రీ శ్రీ చౌడేశ్వరి దేవి కమిటీ హాల్ ఆదివారం రోజు తోగుట వీర క్షత్రియుల కుల బంధువుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకు న్నారు. అధ్యక్షులుగా రంగం నరసింహులు, ఉపాధ్యక్షులుగా పెనుగొండ శ్రీనివాసులు, కోశాధికారి గా పూరు విజయబాబు, ప్రధాన కార్యదర్శి గుంపు విజయకుమార్ నూతన కమిటీని ఎన్నుకోవ డం జరిగింది. ఈ కమిటీ మొదటి సమావేశంలో కుల బంధువుల కోసం ఎల్లప్పుడూ అందుబాటు లో ఉంటామని అలాగే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొగుటవీర క్షత్రియులకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని వారు సభాముఖంగా తెలియజేశారు. తొగుట వీర క్షత్రియులు అన్ని రంగాలలో ముందుండాలని బీసీలుల తొగుటవీర క్షత్రియులకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో తోగుటవీర క్షత్రియ కుల బంధువులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## ఆరోగ్యమే మహాభాగ్యం ...ఉత్సాహంగా 2 కే రన్

**నారాయణపేట టౌన్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తికానున్న నేపథ్యంలో డిసెంబర్ 1 నుంచి 9 వరకు నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల సంబరాల సందర్భంగా ఆదివారం మొదటిరోజు సందర్భంగా జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో క్రీడలశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కే రన్ ను డీవైఎస్‌ఓ వెంకటేశ్ ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదంతో జెండా ఊపి ప్రారంభించారు. మినీ స్టేడియం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగిన 2 కే రన్ లో వ్యాయామ ఉపాధ్యాయులు, కళాశాల విద్యార్థులు, వాకర్స్, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివైఎస్ఓ వెంకటేష్ మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకే కార్యక్రమాన్ని నిర్వహించామని పేర్కొన్నారు. ఆరోగ్యం విషయంలో ప్రతి ఒక్కరూ ప్రత్యేక దృష్టి సారించాలని, శ్రద్ధ వహించాలని, ఇలాంటి రన్స్ పెట్టడం వల్ల ముఖ్యంగా యువత, వయోవృద్ధులకు అత్యంత సహాయకరంగా ఉంటుందనన్నారు.ప్రతీ ఒక్కరికి ఉదయం పూట నడక, రన్నింగ్ లాంటివి అవసరమన్నారు. ఈ 2కే రన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## సంక్షేమ పథకాల్లో నాయిబ్రహ్మణులకు

## ప్రాధాన్యత ఇస్తాం: ఎమ్మెల్యే పర్నికరెడ్డి

**ధన్వాడ, డిసెంబరు 1 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల్లో నాయిబ్రహ్మణులకు అధిక ప్రాధాన్యతను ఇచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే చిట్టెం పర్నికరెడ్డి సహాయకులు మాధవరెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో శనివారం ధన్వాడలోని నాయిబ్రహ్మణ వీధిలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించిన కార్తీకమాస పూజ కార్యక్రమంలో మాదవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయిబ్రాహ్మణ కుల పెద్దలతో మాట్లాడుతూ ప్రధానంగా రాబోయే ఇందిరమ్మ ఇండ్లలో ఇండ్లు లేని వారికి ఇస్తానున్నారు. అదేవిధంగా నూతన నాయిబ్రహ్మణ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజరు చేయిస్తామన్నారు. మాధవరెడ్డిని మాధవరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు జరిగిన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. అంజనేయస్వామికి ఆకుపూజతో పాటుగా అభిషేకం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో లక్ష్మయ్య, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు యం.సత్యనారాయణ, కృష్ణయ్య, పెద్ద ఆంజనేయులు, ఎం.నర్సింలు, సూరి రాఘవేందర్ రాము, మంజునాథ్‌తో పాటుగా మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు జట్రం లక్ష్మయ్య, నీరటి రామచంద్రయ్య, జుట్ల ఆనంద్ గౌడ్, కందనూరు రైమన్ ఖాన్, షాకీర్ హుస్సేన్, నీరటిబాబా, నరేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు .

# పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన,ఉపన్యాస పోటీలు

**విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యం: ఎంఇఓ సుధాకర్**



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎంఈఓ సుధాకర్

**రాజాపూర్, డిసెంబరు 01 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన పోటీలు,ఉపన్యాస పోటీలను ఆదివారం రాజాపూర్ మండల స్థాయి విద్యార్థులకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఇఓ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వ్యాసరచన,ఉపన్యాస పోటీలను పునరుత్పాదక ఇంధన వనరుల అంశంపై నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు సోమవారం జిల్లా స్థాయిలోను పోటీలను నిర్వహించడం జరుగుతుందని ఎంఇఓ సుధాకర్ తెలిపారు.మండల స్థాయి వ్యాసరచన పోటీలో ఆంగ్ల మాధ్యమంలో నుండి మొదటి స్థానంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాజాపూర్ విద్యార్థి సభావాట్ వినోద్‌నాయక్,రెండో స్థానం తిర్మలాపూర్ పాఠశాల విద్యార్థి నవ్యశ్రీ, తెలుగు మీడియం రంగారెడ్డి గూడ పాఠశాల విద్యార్థి గీత,రెండవ స్థానం రాజాపూర్ పాఠశాల విద్యార్థి విజయ మరియు ఉపన్యాస పోటీల్లో మొదటి స్థానం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఓంకుమారి ,కేజీబీవీ లో రెండవ స్థానంలో గీతికా, తెలుగు మీడియం రంగారెడ్డిగూడ వేణు ,తిర్మలాపూర్ నుండి పావని ఎంపిక కావడం జరిగింది.వారికి ఎంఇఓ సుధాకర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎంఇఓ సుధాకర్ ,ఉపాధ్యాయులు హనుమపప్ప,హనుమంత్,సరళ,సరోజ, భాగ్యలక్ష్మి,సతీష్ విద్యార్థులు పాల్గొన్నారు.

# పశు సంపద మానవాళికి మేలు చేస్తుంది

**-పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ డా ఉదయ్ కుమార్**



శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

**కల్వకుర్తి, డిసెంబరు 01 ప్రభాతవార్త:**పశువుల ఆరోగ్యం పట్ల సరైన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డా.ఉదయ్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ సేవ పథకంలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు గ్రామంలో పశువైద్య శిబిరాలు నిర్వహించారు. పీవీ నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం, పశు వైద్య కళాశాల రాజేంద్రనగర్, పశువైద్య మరియు పశుసంవర్ధక శాఖ, విజయ డెయిరీల ఆధ్వర్యంలో కల్వకుర్తి మండలంలోని యంగంపల్లి,కుర్మిద్ద గ్రామాలలో, వెల్దండ మండలం కుప్పగండ్ల, తెల్లపలుగుతండాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలకు పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్ డా.ఉదయ్ కుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేసి రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ శిబిరాల్లో ఎదకు రాని పశువులకు, చూడి నిలవని పశువులకు,గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు, దీర్ఘకాల వ్యాధులు ఉన్న పశువులకు, శస్త్రచికిత్సలు అవసరమైన పశువులకు నిపుణులైన అధ్యాపకులచే పరీక్షించి చికిత్సలు చేస్తారని తెలియచేసారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా బాహ్య పరాన్న జీవుల బెడద ఎక్కువగా ఉంది, దీని వలన పశువులు నీరసించి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. బాహ్య పరాన్న జీవులను నియంత్రించినట్లయితే పశువులలో ఉత్పత్తి మరియు పునరుత్పత్తి సామర్థ్యాన్ని పెంచవచ్చు అని తెలియచేశారు. బాహ్య పరాన్న జీవుల నియంత్రణకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని తెలియచేశారు. జిల్లా పశువైద్య మరియు పశుసంవర్ధక అధికారి డా జి వి రమేష్ మాట్లాడుతూ ప్రతిరోజూ నాలుగు గ్రామాలలో పశు వైద్యశిబిరాలు ఏర్పాటు చేశామని,ఈసదవకాశాన్ని రైతులు వినియోగించుకోవా లని తెలిపారు. ఈ శిబిరాల్లో 367 పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స, 72 పశువులకు ఇతర అనారోగ్యాలకు చికిత్సలు, రక్త పరీక్షలు, పేడ పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఇంచార్జ్ డా రమణ,డా కేసీఎస్ రెడ్డి, డా రాజేష్, నాగరాజ్, శివ,శ్యామ్, పశువైద్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, విజయ డెయిరీ సిబ్బంది, అధ్యక్షులు పాల్గొన్నారు.

# విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి



విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎంఈఓ

**తెలకపల్లి, డిసెంబరు 1 ప్రభాతవార్త:** రాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారంలోకి వచ్చాక సంవత్సర కాలంగా విద్యారంగ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నదని మండల విద్యాధికారి సి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజా పాలన, ప్రజా విజయోత్సవాలు తొమ్మిది రోజుల సంబరాల కార్యక్రమంలో భాగంగా ఆదివారం మొదటి రోజు ఎడ్యుకేషన్ డే కార్యక్రమం మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రం నందు మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు చెందిన విద్యార్థులకు "పునరుత్పాదక శక్తి వనరులు" అనే అంశంపై 8,9,10 వ తరగతుల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేసినట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పాఠశాలలకు మౌలిక వసతులు, ఉచిత విద్యుత్తు, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, నూతన ఉపాధ్యాయుల నియామకము, జాబ్ క్యాలెండర్, స్కిల్ యూనివర్సిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు, మాదకద్రవ్యాల కట్టడి, కొలువుల పండుగ ,విద్యార్థుల డైట్ కాస్మొటిక్ ఛార్జీలు పెంపు, మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు ప్రతినెలా చెల్లింపు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డితో పాటు సిఆర్‌పిలు ఎల్లగౌడ్ , వెంకటేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండుగగా దేవత వృక్షాలకు కార్తిక దీపారాధన

**భక్తులకు సామూహిక అన్న ప్రసాద వితరణ**

**బిజినేపల్లి, డిసెంబరు1 ప్రభాతవార్త :** ప్రకృతిని నిత్యం ఆరాధిస్తూ, మానవాళికి నిత్యం తోడ్పాటు అవుతున్న ప్రకృతిని సంరక్షించాలని,మానవాళికి ఆరోగ్యరీత్యా ఆర్థికంగా ఉపయోగపడుతున్న వృక్షాలకు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు కార్తిక అమావాస్య సందర్భంగా ప్రత్యేకంగా భక్తిశ్రద్ధలతో కార్తీక దీపారాధన చేశారు. కార్తిక ఆదివారం పాలెం వ్యవసాయ క్షేత్రం ముందుగల అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం దేవతా వృక్షాలకు శాస్త్రోక్తంగా వివిధప్రాంతాల నుండి వచ్చిన భక్తులచే ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ శర్మ ప్రత్యేక పూజలు చేయించారు.దేవత వృక్షాలైన జమ్మి, బిల్వం, జిల్లేడు, రవి, వేప, మందర,తులసి, కలబంద, ఉసిరి, అరటి, గన్నేరు, గరక , తమల పత్ర దేవత మొక్కలకు,వృక్షాలకు ప్రత్యేక పూజలు చేశారు.బిల్వ వృక్షం కింద పరమశివునికి అభిషేక అర్చనలు చేశారు. అనంతరం పాల్గొన్న భక్తులకు సామూహిక అన్నప్రసాద పంపిణీ కుమ్మెర గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి పద్మమ్మ దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. వెలుగు లక్ష్మణ్,ఆలయ కమిటీ సభ్యులు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు పూర్తి స్థాయిలో ఋణ మాఫీ చేసి రైతు పండుగలు చేయాలి

**- బీఆర్ఎస్ జిల్లా నాయకులు, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్ ముదిరాజ్**

**వెల్దండ, డిసెంబరు 01 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రైతులు ఏ మాత్రం సంతోషంగా లేరని, అలాంటప్పుడు రైతు పండుగలు ఎలా జరుపుకుంటున్నారో చెప్పాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు, సింగిల్ విండో డైరెక్టర్, మాజీ సర్పంచ్ శేఖర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం వెల్దండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులను మోసగించినందుకే రైతు పండుగలు చేసుకుంటున్నారా అని ఆయన ప్రశ్నించారు. రైతుకు ఎకరానికి రూ.15000 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రైతుబంధు ఇవ్వకుండా మోసం చేస్తుందని ఆరోపించారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ పేర్లు చెప్పి రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. 6 గ్యారంటీల పేరుతో అధికారులకు వచ్చిన కాంగ్రెస్ ప్రజలను పూర్తిగా మోసగించిందని, గత కెసిఆర్ ప్రభుత్వ హయాంలో పదేళ్లు రైతులు ఎంతో సంతోషాలతో ఉన్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో రైతులు విసుపోయారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ నరసింహ ముదిరాజ్, బీఆర్ఎస్ మండల నాయకులు ఈదులపల్లి శ్రీను, ప్రసాద్, రామచంద్రయ్య గౌడ్, శ్రీను, రామచందర్ తదితరులు ఉన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమము కాపాడాలి: బాల్‌రామ్

**మాగనూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** భవన నిర్మాణ కార్మికులకు అందించే సంక్షేమ పథకాలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పజెప్పవద్దని పెండింగ్లో ఉన్న క్లెయిమ్‌లకు వెంటనే నిధులు విడుదల చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పుంజనూర్ ఆంజనేయులు డిమాండ్ చేశారు. మాగనూరు మండల కేంద్రంలో జరిగిన మేస్త్రీల సంఘం నాయకుల ఆదివారం రోజు సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు తెలంగాణ భవన సంక్షేమ బోర్డు ద్వార గుర్తుంపు కార్డులు కార్మిక అధికారులు అందజేయాలన్నారు సరైన సమయంలో కార్డులు రెన్యువల్ చేయక బోర్డు ద్వార అందే ప్రయోజనం పొందడం లేదన్నారు.. కార్మికుల కార్డులు ప్రభుత్వమే రేనివల్ చేయాలని డిమాండ్ చేసారు వలసలు వెళ్లి పని చేస్తు ప్రమాదవశాత్తు మరణిస్తున్న భవన నిర్మాణ కార్మికులకు కార్డు తో సంబంధం లేకుండా బాధిత కుటుంబాలకు సహాయం అందివ్వాలని డిమాండ్ చేసారు.ఈ సమావేశంలో మేస్త్రీల సంఘం నాయకులు కొల్వూర్ నర్సిములు,కుమ్మరి మారెప్ప,బాల్దాస్ రమేష్, బోయరవి,ఒంటెల్ వెంకటయ్య, దాసరి వీరేష్, కోనింటి మల్లేష్, దాసరి రాజు తదితరులు పాల్గొన్నారు .

# మాలల సింహగర్జన సభకు బయలుదేరిన మాగనూరు యువకులు

**మాగనూరు, డిసెంబరు 1 ప్రభాతవార్త :** హైదరాబాద్ లోని సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన మాలల సింహగర్జనకు మాలలు పెద్ద ఎత్తున బయలుదేరారు. ఉమ్మడి మాగనూర్ మండలంలోని ముడుమాల్, హిందూపూర్, తంగిడి, చేగుంట, మురహర్దొడ్డి, పుంజానూర్, అచ్చంపేట్, కొల్పూర్,అమ్మపల్లి, సత్యరంతో పాటుగా మాగనూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి మాగనూర్ యువకులు,పెద్దలు పూలమాలవేసి హైదరాబాద్ బయలుదేరారు. మాలలు ఎవరికి వ్యతిరేకం కాదని మాలల ఆత్మగౌరవం కోసమే సభలు అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాలల తక్కువగా ఉన్నారన్న మాటలు కరెక్ట్ కాదన్నారు. మాలలు ఎవరికి తక్కువ కాదని నిరూపించే సమయం వచ్చిందనారు, రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వాలు ఏ నిర్ణయం తీసుకున్న స్వాగతించి సహకరిస్తాం. రాజ్యాంగానికి వ్యతిరేకంగా తీసుకున్న ఏ నిర్ణయాలైన భారత రాజ్యాంగ పరిరక్షకులుగా తప్పకుండా వ్యతిరేకిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాగరి నరసింహులు, సగరం రమేష్, భాస్కర్ రాఘవేంద్ర, బ్యాగరి మహేష్,పూజారి ఎల్లప్ప,మరెప్ప, సాధు వెంకటయ్య తో పాటు పెద్ద ఎత్తున మాల యువకులు హైదరాబాద్ కు బయలుదేరారు.

# సీఎం సహాయనిధి చెక్కను బాధితులకు అందించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు



బాధితులకు చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**పెబ్బేరు డిసెంబరు 01 ప్రభాతవార్త :**మండలం పాత సుగురుగ్రామంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును రాష్ట్ర ప్రణాళిక ఉపాధ్యక్షుడు డాక్టర్ జి చిన్నారెడ్డి సహకారంతో సూగూరు గ్రామానికి చెందిన కటికే లక్ష్మీబాయికి 36000 రూపాయల చెక్కును డాక్టర్ జి చిన్నారెడ్డి ఆదేశాల మేరకు వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు అందించడం జరిగింది.ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యులు కాంగ్రెస్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపడం జరిగింది. ఈ కార్యక్రమంలో కె రాజశేఖర్ గౌడ్, మాజీ సర్పంచ్ సుగుర్ పి శ్రీనివాసులు మాజీ సర్పంచ్ సూగూర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు బుచ్చన్న యాదవ్ కండక్టర్ ఆంజనేయుల, ఉమ్మడి సుగుర్ మైనార్టీ ప్రజెంట్ హఫీజ్,మంగలి పులేందర్ స్వామి, సాకలి ఆంజనేయులు,గుణమోని బాలయ్య,పకీరయ్య,ఆడేం బలరాం,మిద్దె కురుమన్న, తెలుగు విజయ్,కటికే నర్సోజి ,శేఖర్ ,తెలుగు నరసింహ, శివ,తదితరులు పాల్గొన్నారు.

# గద్వాల్‌లో ఆ ముగ్గురు..

మొదటి పేజీ తరువాయి భాగం..

కేటాయింపుల జాబితా ఒకలాగా ఉంటే, అధికార పార్టీ నేతల హుకుంతో అంతా తారుమారవుతోంది ఇతర మిల్లుల చిరునామాపైనా మూడు మిల్లులకు ధాన్యం కేటాయింపులు జరుగుతున్నాయని నిబంధనల ప్రకారం సెక్యూరిటీ డిపాజిట్లలతో పాటు అన్ని పత్రాలు జత చేసి అధికారులకు ఇచ్చినా తమకు కటాయింపులో అన్యాయం జరుగుతోందని మిల్లరు వాపోతున్నారు. ధాన్యం కేటాయింపుల్లో అధికార పార్టీకి చెందిన నాయకుల మాటలకే నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు చేసిన ధాన్యం కే టాబుంపుల్లో సమన్యాయం పాటించడం లేదని మిల్లర్స్ అంటున్నారు. ఐజ మార్గంలో ఉన్న మిల్లుకు ఇప్పటి వరకు 60 వేల బస్తాలు, బీరెల్లి రోడ్డులో ఉన్న మిల్లుకు 40 వేల బస్తాలు, అనంతపురం వద్ద మిల్లుకు 40 వేల బస్తాల వడ్లు దించుకున్నట్లు సమాచారం. ఈ మూడు మిల్లులకు ఆర్ఎన్ఆర్ వడ్లు దించినట్లు సమాచారం. ఈ వడ్లకు పూణే, గుజరాత్, తమిళ నాడు రాష్ట్రాలలో క్వింటాల్ ధర 3500 రూపాయలు ఉన్నట్లు సమాచారం. వీటిని ఆ మూడు రాష్ట్రలలో అమ్మేందుకు ఆ మూడు మిల్లర్స్ రాయచుర్ బ్రోకర్ లతో ఇప్పటికీ ఒప్పందం చేసుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ సీజన్ లో ఈ నలుగురు 8 కోట్లు సంపాది స్తారని ప్రచారం జరుగుతుంది. 2000 రూపాయల విలువ వడ్లు రాయచూరు వ్యాపారుల నుండి ఇప్పటికే 100 క్వింటాళ్ళు ఒక మిల్లర్ కొనుగోలు చేసినట్లు సమాచారం. రాయచూరు నుండి కొనుగోలు చేసిన పిడిఎస్ బియ్యం ను సిఎంఆర్ కింద జమ చేస్తారని ప్రచారం జరుగుతుంది.

## భక్తిశ్రద్ధలతో శనేశ్వరస్వామి సామూహిక వ్రతాలు

మొదటి పేజీ తరువాయి భాగం..

అనురాధ నక్షత్ర యుక్తంగా ఉండడంతో శనేశ్వర స్వామివారిని, బ్రహ్మసూత్రం గల పరమశివుని శక్తి యుక్తంగా పూజించడం దర్శించడం స్మరించడం ఎంతో పుణ్యఫలితాన్ని పొందవచ్చని తెలిపారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులకు ప్రత్యేక వసతిని ఆలయ నిర్వాహకులు కల్పించారు. ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రత్యేకంగా కార్తీకమాసంలోనే సామూహిక శనేశ్వర వ్రతాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్తీక మాసంలో స్వామివారి దర్శనం పూజించడం అనంతరం కార్తీక వనభోజనాలు స్వీకరించడం భక్తులకు ఎంతో పుణ్యం లభిస్తుందన్నారు.స్వామివారిని సందర్శిం చిన భక్తులందరికీ ఏలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించామని అనంతరం కార్తీక వన భోజనాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో అర్చకులు గవ్వ మఠం శాంతికుమార్, ఉమామహేశ్వర్, కమిటీ సభ్యులు వీరశేఖర్, ప్రభాకరాచారి, జనార్ధన్, ఆలయ సిబ్బంది గోపాల్ రెడ్డి కమిటీ సభ్యులు ఇతర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, మహిళలు వేలాదిగా పాల్గొన్నారు.

## తుఫాన్ హెచ్చరికల కారణంగా

## నేడు వరి కొనుగోళ్లు నిలిపివేత

**నారాయణపేట టౌన్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** వాతావరణ శాఖ నారాయణపేట జిల్లాకు తూఫాన్ హెచ్చరికలు జారీ కాంణంగా నేడు నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో వరి కొనుగోళ్లను నిలిపివేసినట్టు మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాంపురం శివారెడ్డి తెలిపారు. ఆదివారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరిక కారణంగా నేడు వరి కొనుగోళ్లను నిలిపివేయడం జరిగిందన్నారు. మంగళవారం నుండి యధావిధిగా కొనుగోళ్లకు ఎలాంటి ఆటంకం ఉండదని తెలిపారు. కందుల కొనుగోళ్ళు మాత్రం యధావిధిగా విధిగా కొనసాగుతాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలి అన్నారు.

## పోలీస్ కిష్టయ్యకు ఘన నివాళి

**మక్తల్, డిసెంబరు 01 ప్రభాతవార్త:** మలి దశ తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న అమరవీరుడు పోలీస్ కిష్టయ్య వర్ధంతి సందర్భంగా ఆదివారం మక్తల్‌లోని ముదిరాజ్ సంఘం భవనం వద్ద ఆయన చిత్రపటానికి స్థానిక ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును ఆకాంక్షిస్తూ పోలీస్ కిష్టయ్య తన ప్రాణాలను సైతం ఏమాత్రం లెక్క చేయకుండా అమరుడయ్యాడన్నారు.కార్యక్రమంలో నాయకులు కోళ్ల వెంకటేష్,బి.నర్సింలు, రవికుమార్,వాకిటిశ్రీనివాస్, వల్లంపల్లి లక్ష్మణ్, మామిళ్ళకిష్టప్ప,వాకిటిశ్యామ్,గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక టిప్పర్ పట్టివేత

**మక్తల్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** కృష్ణ మండలం నుంచి మరికల్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ ను ఆదివారం మక్తల్ పట్టణ శివారులో సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు మక్తల్ ఎస్సై వై. భాగ్యలక్ష్మిరెడ్డి తెలిపారు. ఈ మేరకు టిప్పర్ డ్రైవర్ మహిమూద్ పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## విద్యాశాఖ ఆధ్వర్యంలో

## ప్రజాపాలన విజయోత్సవాలు

**పెబ్బేరు డిసెంబరు 01 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణంలో తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖ ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలులో భాగంగా ఆదివారం రోజు పెబ్బేరు మండల వనరుల కేంద్రం నందు మండల విద్యాధికారి జయరాములు ఆధ్వర్యంలో వ్యాసరచన కాంపిటీషన్స్ నిర్వహించారు. వివిధ పాఠశాలల నుండి వచ్చిన 40 మంది విద్యార్థులకు రెన్యువబుల్ ఎనర్జీ రిసోర్స్ అనే అంశం మీద వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో వివిధ పాఠశాలల నుండి సైన్స్ టీచర్స్ శ్రీనివాసులు గోపాల్ నాయక్, మోడల్ స్కూల్ నుండి పిఈటి కమలాకర్, సాయికుమార్,శ్వేత, ఫరీద, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.అలాగే కాంపిటీషన్లో పాల్గొన్న విద్యార్థుల అన్సర్ చేసి మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ఇవ్వడం జరిగింది.తెలుగు మీడియం లో రజియా జిల్లా పరిషత్ రంగాపూర్, ఇంగ్లీష్ మీడియం లో హాసిని మొదటి బహుమతి మోడల్ స్కూల్ తీసుకున్నారు , ద్వితీ, తృతీయ తో పాటు వ్యాస రచన లో పాల్గొన్న అందరి విధ్యార్థులకు పార్టిసిపేట్ ప్రైస్ ఇచ్చారు.

## భూత్పూర్ ప్రభుత్వ యునానీలో

## ప్రజాపాలన విజయోత్సవం

**భూత్పూర్,డిసెంబర్ 1,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవాన్ని పురస్కరించుకుని భూత్పూర్ ప్రభుత్వ యునానీ వైద్యశాఖ ఆదివారం ఆసుపత్రిలో విజయోత్సవ దినాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజాపాలన ఉద్దేశ్యం,ఆవశ్యకత గూర్చి యునానీ వైద్యులు డాక్టర్ ఎండి జహీరొద్దిన్ ప్రజలు,రోగులకు వివరించారు.ఈ కార్యక్రమంలో యునాని ఓఎస్ రవికాంత్,పీటీఎస్ సాబేర్ పాల్గొన్నారు.